తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 80 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 శుక్రవారం 23 - 10 - 2026 వెల రూ. 2 రూ/



ఏపీకి మరో తుపాను ముప్పు!

- బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన వాతావరణ వ్యవస్థ
- అండమాన్ సమీపంలో ఉపరితల ఆవర్తనం గుర్తింపు
- అక్టోబర్ 23 నాటికి అల్పపీడనంగా మారే అవకాశం
- పశ్చిమ వాయుువ్య దిశగా కదులుతూ ఏపీ తీరం వైపు రావొచ్చని అంచనా
- తుపానుగా మారితే కోస్తాంధ్రపై ప్రభావం చూపే సూచనలు

అమరావతి :

బంగాళాఖాతంలో మరో తుపాను భయం నెలకొంది. ఈశాన్య రుతుపవనాల సమయంలో ఏర్పడే వాతావరణ మార్పులు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ప్రజలను మరోసారి ఆందోళనకు గురిచేస్తున్నాయి. అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం క్రమంగా బలపడి, అల్పపీడనంగా మారి తుపానుగా రూపాంతరం - మిగతా 2 లో



తెలంగాణలో ప్రధాని
మోదీ పర్యటన

- వరంగల్ కేంద్రంగా అభివృద్ధి పనులు
- వరంగల్ రైల్వే మ్యాన్ ఫ్యాక్చరింగ్ సెంటర్‌ను జాతికి అంకితం చేయడానికి డిసెంబర్‌లో ప్రధాని మోదీ తెలంగాణకు రానున్నారు

హైదరాబాద్ :

తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన డిసెంబర్ నెలలో ఉంటుందని రాష్ట్ర బీజేపీ స్పష్టం చేసింది. వరంగల్‌లో రైల్వే మ్యాన్ ఫ్యాక్చరింగ్ సెంటర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌ను జాతికి అంకితం చేయనున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటిస్తారని విశ్వసనీయ వర్గాల ద్వారా - మిగతా 2 లో

సీఎం చంద్రబాబుతో పవన్ భేటీ
స్థానిక ఎన్నికలపై చర్చ

- సీఎం చంద్రబాబు నివాసానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లారు
- స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ కీలకంగా చర్చించారు
- సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో హుటాహుటిన భేటీ
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వ్యూహంపై ఇరువురు నేతల చర్చ
- కూటమిలో సీట్ల సర్దుబాటు, నామినేషన్లపై కీలక నిర్ణయాలు



అమరావతి :

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ చోటుచేసుకుంటున్న పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలకంగా చర్చించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాలు, ఎన్నికల వాయిదా నేపథ్యంలో తాజా పరిస్థితులు, కూటమి పార్టీల్లో రెబల్ అభ్యర్థుల వ్యవహారంపై ఇరువురు నేతలు సమాలోచనలు జరిపినట్లు సమాచారం. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నెలకొన్న పరిస్థితులపైనా చర్చించినట్లు తెలిసింది.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల తుది జాబితా విడుదలను నిలిపివేయాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్న మార్పులు, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. ఎన్నికల సంఘం తదుపరి నిర్ణయం, ఎన్నికల నిర్వహణకు సంబంధించి అనుసరించాల్సిన విధానంపైనా చర్చించినట్లు తెలుస్తోంది.స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపికతో పాటు రెబల్ అభ్యర్థుల పోటీ అంశం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయావకాశాలు, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎదురవుతున్న సమస్యలపై ఇరువురు నేతలు మాట్లాడుకున్నట్లు - మిగతా 2 లో

ఎంత వరకైనా
పోరాడదాం



- వైసీపీ అధినేత జగన్
- వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ
- స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ
- చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ

అమరావతి :

వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ - మిగతా 2 లో

పోలాండ్ ప్రధానితో
మోదీ ద్వైపాక్షిక చర్చలు



- భారత్- ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కొత్త అవకాశాలు
- పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు

ఢిల్లీ :

భారత్- యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్- పోలాండ్ భాగస్వామ్యానికి కొత్త అవకాశాలను సృష్టించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో పోలాండ్ ప్రధాన మంత్రి డొనాల్డ్ టస్క్‌తో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ముఖ్యంగా భారతదేశం పెరుగుతున్న ఆర్థిక బలాన్ని, గత రెండేళ్లుగా ద్వైపాక్షిక సంబంధాల్లో నెలకొన్న వేగాన్ని ప్రస్తావించారు. విశ్వసనీయమైన ప్రపంచ సరఫరా గొలుసులను అభివృద్ధి చేయడానికి, 2030 నాటికి తమ ఉమ్మడి ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని సాధించడానికి - మిగతా 2 లో

ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు షెడ్యూల్



అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో 2027 విద్యాసంవత్సరానికి సంబంధించిన

- ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు థియరీ పరీక్షల నిర్వహణ
- ఫిబ్రవరి 24 నుంచి ఫస్టియర్, ఫిబ్రవరి 25 నుంచి సెకండియర్ పరీక్షలు
- ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు
- ఇది తాత్కాలిక షెడ్యూల్ మాత్రమేనని బోర్డు వెల్లడి
- పండుగలు, సెలవులను బట్టి తుది షెడ్యూల్‌లో మార్పులకు అవకాశం

ప్రకృతితో ఘర్షణ వద్దు
విపత్తులను తప్పించలేం



- 'అలయ్ బలయ్'లో వెంకయ్యనాయుడు
- హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన అలయ్ బలయ్ వేడుకలు
- ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించిన వెంకయ్యనాయుడు
- రాజకీయాలకు అతీతంగా హాజరైన వివిధ పార్టీల నేతలు
- 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' ఇతివృత్తంతో కార్యక్రమం
- ఐక్యతను చాటిన సాంస్కృతిక సమ్మేళనమని వక్తుల ప్రశంస

హైదరాబాద్ :

ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, - మిగతా 2 లో

మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే 'అలయ్ బలయ్'



- అలయ్ బలయ్ సమ్మేళనం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఘనంగా జరిగింది
- వివిధ పార్టీల నేతలు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు
- అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ :

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానం వేదికగా అలయ్ బలయ్ దసరా సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. భారతీయ సాంస్కృతిక ఔన్నత్య పునరుద్ధరణ - మిగతా 2 లో



గడ్డం పెంచితే కేటీఆర్ సీఎం అయిపోతాడా?

- నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్
- 2028లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమన్న ఎంపీ అర్వింద్
- గడ్డం పెంచితే కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేరంటూ వ్యంగ్యాస్త్రాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య పొత్తు చర్చలు జరుగుతున్నాయి

హైదరాబాద్ :

నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడం వల్లే కేటీఆర్ ఆ పని చేస్తున్నారని, అయితే ఆయన గడ్డం - మిగతా 2 లో

జనగణనలో కులగణన చేసి ఎవరూ చేయని సాహసం చేశాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వందేళ్లలో ఎవరూ చేయని పని తమ ప్రభుత్వం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు
- ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని పునరుద్ధాటించారు
- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ



హైదరాబాద్ :

పేదల పక్షాన నిలబడి, దొరల దోపిడీని ఎదిరించి అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలకు అండగా నిలిచిన ఆయన చరిత్రను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో పండగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీఎం ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశాన్ని మంత్రివర్గంలో చర్చిస్తామని ప్రకటించారు. వారిని ప్రభుత్వంలో భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు.నిజాం పాలనలో భూస్వాములు, దొరలు పేదల భూములను ఆక్రమిస్తుంటే వారికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి పండుగ సాయన్న అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దొరలకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేసి పేదలకు అండగా సాయన్న నిలిచారని గుర్తుచేశారు. ప్రజలకు ధాన్యం పంచడంతో పాటు పేద ఆడబిడ్డలు వివాహాలకు ఆర్థిక సాయం చేసిన ఘనత సాయన్నదని కొనియాడారు. అన్యాయంగా హత్యకు గురైనప్పటికీ వందేళ్లు దాటినా పండుగ సాయన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 23 - 10 - 2026

సంపాదకీయం

కలల ప్రపంచాన్ని కూల్చిన బ్లాక్ థర్స్‌డే



1920వ దశకంలో అమెరికా వీధుల్లో కొత్త వెలుగులు విరబూశాయి. పరిశ్రమలు వేగంగా వృద్ధి చెందాయి, రోడ్డపై కొత్త కార్లు పరుగులు తీశాయి, రేడియోలు ఇళ్లలోకి చేరాయి. ఈ కాలాన్ని చరిత్రలో 'రోరింగ్ ట్వెంటీస్' అని పిలుస్తారు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత అమెరికా... ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన కేంద్రంగా మారింది. ఆ రోజుల్లో ప్రతి ఒక్కరూ స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావచ్చు అని బలంగా నమ్మారు.బడా వ్యాపారవేత్తల నుండి పారిశుద్ధ్య కార్మికుల వరకు తమ పొదుపు మొత్తాలను వాల్ స్ట్రీట్ షేర్ మార్కెట్లోకి గుమ్మరించారు. కంపెనీల నిజమైన విలువ ఎంత; వాటి ఉత్పత్తి, లాభాలు ఎంత అనే ప్రాథమిక సూత్రాలను పెట్టుబడిదారులు పూర్తిగా పక్కన పెట్టేశారు. కేవలం ధర పెరుగు తోందనే ఏకైక కారణంతో షేర్లను కొనడం ప్రారంభించారు. ఈ విధంగా మార్కెట్లో ఒక భారీ ఊహాజనిత బుడగ (స్పెక్యులేటివ్ బబుల్) రూపుదిద్దుకుంది.ఆ కాలంలో మార్కెట్‌ను ముంచెత్తిన అతిపెద్ద ముప్పు 'అప్పు (మార్జిన్ మనీ)తో షేర్లు కొనడం'. పెట్టుబడిదారుడు తన సొంత డబ్బు కేవలం 10 శాతం నుండి 20 శాతం మాత్రమే చెల్లించి, మిగిలిన 80 శాతం కంటే ఎక్కువ మొత్తాన్ని బ్రోకర్ల నుండి అప్పు తీసుకునేవాడు. మార్కెట్ పెరుగుతున్నంత కాలం ఈ విధానం అద్భుతమైన లాభాలను తెచ్చిపెట్టినట్లు కనిపించింది.అయితే షేర్ ధరలు కొద్దిగా తగ్గినా, బ్రోకర్లు అదనపు మార్జిన్ డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చేవారు. అదనపు నగదు చెల్లించలేని పరిస్థితుల్లో, బ్రోకర్లు ఆ షేర్లను బలవంతంగా మార్కెట్లో అమ్మకానికి పెట్టేవారు. ఇది మార్కెట్ పతనాన్ని మరింత వేగవంతం చేసే విధ్వంసకర చక్రంగా మారింది. అదే సమయంలో అమెరికా పరిశ్రమల్లో అవసరానికి మించి ఉత్పత్తులు పేరుకుపోయాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచడం క్రెడిట్ లభ్యతను మరింత తగ్గించింది.1929 అక్టోబర్ 24, గురువారం న్యూయార్క్ స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో కొద్ది నిమిషాల్లోనే వాల్ స్ట్రీట్ వాతావరణం భయాందోళనలతో అల్లకల్లోలంగా మారింది. పెట్టుబడిదారులు తమ వద్ద ఉన్న షేర్లను వదిలించుకోవడానికి పోటీపడ్డారు. ఆ ఒక్క రోజే దాదాపు 1.29 కోట్ల షేర్లు అమ్ముడయ్యాయి. బ్యాంకర్ల బృందం రంగంలోకి దిగి, మార్కెట్‌ను ఆదుకోవడానికి భారీగా షేర్లను కొనుగోలు చేయడంతో పతనం తాత్కాలికంగా ఆగింది. కానీ అక్టోబర్ 28 సోమవారం (బ్లాక్ మండే) డౌ జోన్స్ సూచీ 12.8 శాతం కూలిపోయింది. మరుసటి రోజు అక్టోబర్ 29న 'బ్లాక్ ట్యూస్డే' నాడు 1.6 కోట్లకు పైగా షేర్లు చేతులు మారాయి. దిగ్గజ కంపెనీల షేర్ల విలువలు పాతాళానికి పడిపోయాయి. సెప్టెంబర్ 3న 381 పాయింట్ల వద్ద ఉన్న డౌ జోన్స్ సూచీ 1932 జూలై నాటికి 41 పాయింట్లకు పడిపోయింది. ఏకంగా 89 శాతం ఆస్తి తుడిచి పెట్టుకుపోయింది.స్టాక్ మార్కెట్ సంక్షోభం క్రమంగా సామాన్యుడి జీవితాన్నీ తీవ్రంగా కుదిపివేసింది. కంపెనీల విలువ తగ్గిపోవడంతో పరిశ్ర మలు మూతపడ్డాయి, ఉద్యోగుల తొలగింపు మొదలైంది. 1933 నాటికి అమెరికాలోని ప్రతి ఐదు బ్యాంకుల్లో ఒకటి దివాళా తీసింది. 1932 నాటికి దేశంలో ప్రతి నలుగురు కార్మికులలో ఒకరు నిరుద్యోగిగా మారారు. కాగితాలు, రేకులతో వెలసిన అసంఖ్యాక తాత్కాలిక నివాసాలు నాటి మహా మాంద్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలిచాయి.ఈ ఆర్థిక పతనం 'గ్రేట్ డిప్రెషన్ 'గా రూపాంతరం చెంది ప్రపంచ దేశాలను చుట్టుముట్టింది. 'గోల్డ్ స్టాండర్డ్' ద్వారా సంక్షోభం ఇతర ఖండాలకు విస్తరించింది. జర్మనీలో ఏర్పడిన తీవ్ర నిరుద్యోగం అడాల్ఫ్ హిట్లర్ నాజీ పార్టీ అధికారంలోకి రావడానికి అనుకూల వాతావరణాన్ని కల్పించింది.నాటి బ్లాక్ థర్స్‌డే ఘటన నేటి ఆర్థిక ప్రపంచానికి విలువైన పాఠాలను అందిస్తోంది. కేవలం ధర పెరుగుతోందనే ఒక్క కారణంతో ఆస్తికి విపరీతమైన విలువ ఉందనుకోవడం పెద్ద భ్రమ. మార్జిన్ తో పెట్టుబడి పెట్టడం లాభాలను పెంచినట్లే, నష్టాల సమయాల్లో సర్వస్వం ఊడ్చేస్తుంది. జ్ఞానం కంటే భయం, అత్యాశ మాత్రమే మార్కెట్లను నడిపేటట్లయితే తీవ్రమైన విపత్తులు తప్పవు.

ఏపీకి మరో తుపాను ముప్పు!

మొదటిపేజీ తరువాయి - చెందే సూచనలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే అవకాశాలు ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వివరాల్లోకి వెళితే, అక్టోబర్ 22 ఉదయం 5:30 గంటల సమయంలో ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వాతావరణ నిపుణులు గుర్తించారు. ఈ ఆవర్తనం ప్రభావంతో అక్టోబర్ 23 నాటికి ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రానున్న రోజుల్లో మరింత బలపడనుందని అంచనా వేస్తున్నారు. సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలాన్ని పోస్ట్-మాన్‌సూన్ సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో బంగాళా ఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటం సాధారణమే. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వెచ్చగా ఉండటం, వాతావరణంలో తగినంత తేమ ఉండటం వంటి అనుకూల పరిస్థితులు ఉంటే, ఈ అల్పపీడనాలు త్వరితగతిన వాయుగుండంగా, ఆపై తీవ్ర వాయుగు ండంగా మారి తుపానుగా రూపాంతరం చెందుతాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో అలాంటి అనుకూల పరిస్థితులే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, అల్పపీడనం ఏర్పడినంత మాత్రాన, ప్రతిసారీ అది తుపానుగా మారుతుందని చెప్పలేమని, దాని తీవ్రత, కదలికలను నిరంతరం గమనించాల్సి ఉంటుందని వారు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుత అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తే అది ఆంధ్రప్రదేశ్ లేదా ఒడిశా తీరాల వైపునకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒకవేళ ఈ వ్యవస్థ తుపానుగా మారితే, దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలపై స్పష్టంగా కనిపించవచ్చు. ముఖ్యంగా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గంటకు 100 కిలోమీటర్ల పైబడిన వేగంతో బలమైన గాలులు, సముద్రంలో అలల తీవ్రత పెరగడం వంటి పరిణామాలు సంభవించవచ్చు.ప్రస్తుతానికి తుపాను ఎక్కడ తీరం దాటుతుందనే దానిపై స్పష్టత లేనప్పటికీ, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరుతున్నారు.

పోలాండ్ ప్రధానితో మోదీ ద్వైపాక్షిక చర్చలు

మొదటిపేజీ తరువాయి - భారత్, పోలాండ్ కలిసి పనిచేస్తాయన్నారు."పోలాండ్ ప్రధానికి స్వాగతం పలకడం నాకు చాలా ఆనందంగా ఉంది. 2024లో నేను పోలాండ్‌లో పర్యటించినప్పుడు ఆయన నాకు, నా ప్రతినిధి బృందానికి ఘన స్వాగతం పలికారు. ఆ పర్యటనలో ఇరు దేశాల సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఉన్నతీకరించాం. ఈ బలమైన పునాదిపై, గత రెండేళ్లుగా మా భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుకుంది. ఈరోజు పోలాండ్? ప్రధానితో జరిగిన సమావేశంలో మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. భారతదేశం, పోలాండ్ మధ్య స్నేహం కేవలం దౌత్య సంబంధాలపై మాత్రమే కాకుండా మానవత్వం, కరుణ అనే ఉమ్మడి వారసత్వంపై కూడా ఆధారపడి ఉంది. మన పెరుగుతున్న ఆర్థిక బలం భారత్-పోలాండ్ భాగస్వా మ్యానికి కొత్త అవకాశాలను సృష్టించింది. భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ అవకాశాలను మరింత విస్తృతం చేసింది."ప్రపంచం నేడు అనిశ్చిత, మార్పుల గుండా వెళుతోంది. ఇలాంటి సమయంలో భారత్- పోలాండ్ వృద్ధి, సాంకేతికత, ఆవిష్కరణలకు ముఖ్యమైన కేంద్రాలుగా ఆవిర్భవిస్తున్నాయి. పోలాండ్ జీడీపీ 1 ట్రిలియన్ డాలర్ల చారిత్రాత్మక మైలురాయిని దాటింది. అందుకు ప్రధాని టస్క్‌ను నేను అభినందిస్తున్నాను. గత త్రైమాసికంలో భారత్ కూడా 7.8 శాతం అద్భుతమైన వృద్ధి రేటును నమోదు చేసింది. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న ఆర్థిక బలం భారత్- పోలాండ్ భాగస్వామ్యానికి కొత్త అవకాశాలను అందిస్తోంది. భారత్- యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ అవకాశాలను మరింత బలోపేతం చేసింది. ప్రధాన మంత్రి టస్క్? ఒక పెద్ద వ్యాపార ప్రతినిధి బృందాన్ని తీసుకురావడం నాకు ప్రత్యేకంగా సంతోషంగా ఉంది. ప్రపంచం కోసం విశ్వసనీయమైన సరఫరా గొలుసులను అభివృద్ధి చేయడానికి ఇరు దేశాల కంపెనీలు కలిసి పనిచేస్తాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం అనే మన ఉమ్మడి లక్ష్యాన్ని కూడా సాకారం చేసుకుంటాయని మేము విశ్వసిస్తున్నాం అని ప్రధాని మోదీ అన్నారు.భారత్- ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలుతో పోలాండ్‌కు యంత్రాలు, రసాయనాలు,ప్లాస్టిక్‌లు,ఇంజినీరింగ్ వస్తువుల భారతీయ ఎగుమ తులకు కొత్త అవకాశాలు లభిస్తాయన్నారు. అదే సమయంలో అధునాతన తయారీ, ఆహార శుద్ధి, బయోటెక్నాలజీ, రైల్వేలు, రవాణా వంటి రంగాలు కొత్త పోలిష్ పెట్టుబడులను ఆకర్షిస్తాయని తెలిపారు. రక్షణ, అంతరిక్ష, ఇంధన రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి భారత్- పోలాండ్ అంగీకరిం చాయని చెప్పారు. "రక్షణ, అంతరిక్ష, ఇంధన రంగాల్లో మన సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ రోజు మనం అంగీకరించాం.ఈ వ్యూహాత్మక రంగాలన్నింటిలోనూ భారత్‌తో కలిసి సహ-అభివృద్ధి, సహ-ఉత్పత్తిలో పాలుపం చుకోవాలని పోలిష్ కంపెనీలను మేము ఆహ్వానిస్తున్నాం. కీలక ఖనిజాలు, బొగ్గు వాయు వుగా మార్చే ప్రక్రియల్లో పోలాండ్‌కు ఉన్న నైపుణ్యాన్ని ఉపయో గించుకుని, మేము కొత్త భాగస్వామ్యాలను కూడా ఏర్పరుస్తాం." అని ప్రధాని మోదీ అన్నారు.అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల్లో సహకారాన్ని బలోపేతం చేయడానికి, ఇండియా-పోలాండ్ స్టార్టప్ బ్రిడ్జ్‌ను, ఇరు దేశాల యువత కోసం టెక్నాలజీ హ్యాకథాన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. "ఐటీ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో మా సంబంధం ఇప్పటికే బలంగా ఉంది. అనేక భారతీయ ఐటీ కంపెనీలు పోలాండ్‌లో పనిచేస్తున్నాయి. ఈ సహకా రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ ఇండియా-పోలాండ్ స్టార్టప్ బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయడానికి మేము అంగీకరించాం. మన రెండు దేశాల యువత కోసం టెక్నాలజీ హ్యాకథాన్‌లను కూడా నిర్వహి స్తాం." అని ప్రధాని మోదీ అన్నారు.

తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన

మొదటిపేజీ తరువాయి - తెలుస్తోంది. మొత్తానికి పశ్చిమ బెంగాల్ తర్వాత బీజేపీ తెలంగాణపై ఫోకస్ చేసినట్లుగా కనిపిస్తోంది.హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో రామచందర్‌రావు అధ్యక్షతన ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావులు పాల్గొన్నారు. బీజేపీ ముఖ్యనేతలు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఇతర నేతలు కూడా ఉన్నారు.ముఖ్యనేతల సమావేశంలో బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ బీజేపీ నవంబర్ 1న హైదరాబాద్‌లో భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టనుంది. సర్‌పై కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీలు చేస్తున్న రాద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీ వివిధ కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ పాదయాత్ర చేయనున్నట్లు వెల్లడించింది. "ప్రజాస్వామ్యాన్ని రక్షించండి, గుంపు సామ్యాన్ని ఓడించండి" అంటూ తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్‌రావు పిలుపునిచ్చారు. దేశాన్ని బీజేపీ మాత్రమే రక్షిస్తుందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

గడ్డం పెంచితే కేటీఆర్ సీఎం అయిపోతాడా?

మొదటిపేజీ తరువాయి -

పెరుగుతుందే తప్ప సీఎం మాత్రం కాలేరని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమని, బీజేపీ ఒంటరిగానే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని, ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కోసం తెరవెనుక చర్చలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పొత్తుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరే అడ్డంకిగా ఉన్నారని, ఆయనపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని అన్నారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కై రేవంత్‌ను సీఎం పదవి నుంచి తొలగించేందుకు అధిష్ఠానం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్రంలో బీజేపీ సైలెంట్‌గా ఉందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాజకీయ తుపాను సృష్టించేందుకు తెరవెనుక పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గడ్డం పెంచారని, ఆయన గడ్డం పెరిగింది కానీ కాంగ్రెస్ పార్టీ ఎదగలేకపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండానే విజయం సాధిస్తుందని అర్వింద్ స్పష్టం చేశారు.

సీఎం చంద్రబాబుతో పవన్ భేటీ స్థానిక ఎన్నికలపై చర్చ

మొదటిపేజీ తరువాయి - తెలిసింది. అయితే సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారిక ప్రకటన వెలువడలేదు.గురువారం సీఎం చంద్రబాబు నివాసానికి పవన్ కల్యాణ్ వెళ్లారు. ఎలాంటి భద్రతా సిబ్బంది, కాన్వాయ్ లేకుండా ఒంటరిగా వచ్చిన ఆయన ముఖ్యమంత్రితో కొద్దిసేపు సమావేశమయ్యారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది.

ఎంత వరకైనా పోరాడదాం

మొదటిపేజీ తరువాయి - జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం

మొదటిపేజీ తరువాయి - సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు.ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేదికలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు.'సహ ముక్త్ భారత్ - వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత - అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేదికలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు షెడ్యూల్

మొదటిపేజీ తరువాయి - ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు ప్రకటించింది. థియరీ పరీక్షలు 2027 ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు జరగనున్నాయి.వివరాల్లోకి వెళితే, ఇంటర్ ఫస్టియర్ (జూనియర్ ఇంటర్) పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి జరగనుండగా, సెకండియర్ (సీనియర్ ఇంటర్) పరీక్షలు మరుసటి రోజు, అనగా ఫిబ్రవరి 25న మొదలవుతాయి. ప్రతీరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.థియరీ పరీక్షలకు ముందే ప్రాక్టికల్స్ పూర్తి కానున్నాయి. జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుపుతారు. ఇక ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ పరీక్షలను ఆదివారాలతో సహా ప్రతీరోజూ రెండు సెషన్లలో (ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు) నిర్వహిస్తామని బోర్డు స్పష్టం చేసింది.అయితే, ప్రస్తుతం విడుదల చేసిన ఈ షెడ్యూల్ తాత్కాలికమైనదని (ప్రొవిజనల్) అధికారులు తెలిపారు. ప్రభుత్వ సెలవులు, పండుగల తేదీలను పరిగణనలోకి తీసుకుని తుది షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉందని వారు సూచించారు. విద్యార్థులు ఈ తాత్కాలిక షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

జనగణనలో కులగణన చేసి ఎవరూ చేయని సాహసం చేశాం

మొదటిపేజీ తరువాయి - సీఎం అన్నారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న వంటి పోరాట యోధుల చరిత్రను ప్రజలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ఆవిష్కరిస్తామని ప్రకటించారు.బ్రిటిష్ పాలనలో కులగణన జరిగిందని వందేళ్ల తర్వాత తమ ప్రభుత్వం చేపట్టిందని రేవంత్ రెడ్డి చెప్పారు. కులగణన కారణంగానే వివిధ కులాలు తమ జనాభా, హక్కులపై బలంగా గళం వినిపిస్తున్నాయని తెలిపారు. లెక్కల్లో తమ జనాభా తక్కువగా నమోదైందని ఎవరైనా భావిస్తే పూర్తి వివరాలు అందిస్తే సవరిస్తామని స్పష్టం చేశారు.ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశంపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని సీఎం వెల్లడించారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, సమగ్రంగా అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ఇతర కులాల్లో ఉన్న అపోహలను కూడా తొలగించాల్సి ఉందన్నారు. గతంలో శ్రీహరి ముదిరాజ్‌కు డీసీసీ అధ్యక్ష పదవి, ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి మంత్రిని చేశామని నీలం మధుకు ఎంపీ టికెట్ ఇచ్చామని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు."జనగణనలో కులగణన చేసి ఎవరూ చేయని సాహసం చేశాం. వందేళ్లలో ఎవరూ చేయని పని మా ప్రభుత్వం పూర్తి చేసింది. ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచాం. ఎంతమంది ఉన్నారో తెలిసింది కనుకే మీ గళానికి విలువ పెరిగింది. బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్‌లు కోరుతున్నారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం. గతంలో జరిగిన తప్పు మరోసారి జరగకుండా చూడాలి. ఎందరు ప్రధానులు మారినా ఎస్సీ కులాల వర్గీకరణ జరగలేదు.ముదిరాజులకు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సీఎం సూచించారు. ప్రభుత్వంలో ముదిరాజులను భాగస్వాములను చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. మరోవైపు, గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మరింత విస్తృతంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని



చేపడుతున్నామని పేర్కొన్నారు. బీసీ వర్గీకరణపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి అధ్యయనం చేయిస్తామన్నారు. ముదిరాజుల సామాజిక, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే 'అలయ్ బలయ్'

మొదటిపేజీ తరువాయి - యజ్ఞంలో భాగంగా రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల మధ్య ఏకాత్మతాభావం నెలకొల్పే లక్ష్యంతో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించారు.నషా ముక్తా భారత్ లక్ష్యంతో నిర్వహించిన ఆలయ్ బలయ్ సమ్మేళనానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు వీహెచ్, కె.కేశవరావు, జానారెడ్డితో పాటు బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు హాజరయ్యారు.బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఉదయం 11 గంటలకు శమీ పూజతో అలయ్ బలయ్ ప్రారంభం కాగా అంతకు ముందు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలైన ఆత్మీయుల అలయ్ బలయ్ ఆలింగనాలు, షడ్రుచుల సమ్మేళనం, ఒగ్గుడోలు తాళాల మోత, జొన్నకర్రల జోరు, జమిడిక వాద్యాల హోరు, ఆడబిడ్డల కోలాటాలు, బతుకమ్మ, బోనాలు, గొబ్బెమ్మలు, గౌరమ్మలు, భజన కీర్తనలు, ధమరుక నాదాలు, డప్పు విన్యాసాలు, చిందు యక్షగానాలు, ఒగ్గు కథలు, సన్నాయి వాద్యాలు ఆలయ్ బలయ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.మనిషికి మనిషికి మధ్య ఏకత్వాన్ని ఏర్పరిచేదే అలయ్ బలయ్ అని వెంకయ్యనాయుడు తెలిపారు. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఆలోచనకు అనుగుణంగా వికసిత్ భారత్‌లో మనందరి లక్ష్యం కావాలన్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ అనేది కులమతాలకు రాజకీయాలకు ప్రాంతాలకు అతీతమైన వేదికన్

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పర్యవేక్షణకు

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 22 :స్థానిక సంస్థల (జడ్పీటీసీ, ఎంపీటీసీ) ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పారదర్శకతను పెంపొందించేందుకు 'మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ' **(Media Certification and Monitoring Committee)** ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ వెల్లడించారు. ఈ ఎన్నికలకు సంబంధించి టీవీ ఛానెళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఆడియో-విజువల్ డిస్‌ప్లేలు, ఈ-పేపర్లు, బల్క్ ఎస్‌ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనల ధృవీకరణ సహా 'పెయిడ్ న్యూస్' పరిశీలన, పర్యవేక్షణను జిల్లా స్థాయి ఎంసీఎంసీ చేపడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కమిటీకి జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ ఐ.ఏ.ఎస్ చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ పి. విజయలక్ష్మి మరియు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఏ. బాలకొండయ్య సభ్యులుగా వ్యవహరిస్తారు. ఈ కమిటీ కార్యాలయాన్ని అనంతపురం నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ ప్రాంగణంలో, ప్లానింగ్ సెక్షన్ ఎదురుగా ఉన్న ప్రత్యేక గదిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. రాజకీయ పార్టీలు లేదా వ్యక్తిగత అభ్యర్థులు ఏవైనా రాజకీయ ప్రకటనలను ప్రసారం చేయాలనుకుంటే, సదరు ప్రకటనలు టీవీ లేదా ఇతర మాధ్యమాల్లో ప్రదర్శితమయ్యే తేదీకి కనీసం మూడు రోజుల ముందుగా నిబంధనల ప్రకారం కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ప్రతిపాదనలను 'అనెక్సర్-ఎ' ఫార్మాట్‌లో, ప్రకటన యొక్క ఎలక్ట్రానిక్ కాపీలు (రెండు కాపీలు) మరియు సక్రమంగా ధృవీకరించిన ప్రతిలేఖనం (ట్రాన్స్క్రిప్షన్) పూర్తి వివరాలతో సమర్పించాల్సి ఉంటుంది. పెయిడ్ న్యూస్ ఘటనలపై నిరంతరం నిఘా ఉంచుతూ తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల యంత్రాంగం పేర్కొంది.

వైఎస్సార్ కడప జిల్లా నందలూరులో

ఉద్రిక్తత.. గాల్లోకి కాల్పులు, కార్లు దగ్ధం



నందలూరు (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : వైఎస్సార్ కడప జిల్లా నందలూరులో స్థానిక సంస్థల జడ్పీటీసీ నామినేషన్ల పర్వం తీవ్ర హింసాత్మకంగా మారింది. కూటమి నాయకుల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాల మధ్య తీవ్రస్థాయిలో వర్గపోరు భగ్గుమంది. నామినేషన్ల కేంద్రం వద్ద ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో నందలూరు పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నందలూరుకు చెందిన ఎద్దుల విజయసాగర్‌కు మద్దతుగా టీడీపీ రాజంపేట ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు, ఎలైట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బాలసుబ్రమణ్యం వర్గం నిలవగా, మరోవైపు మేడా విజయశేఖర్ రెడ్డి వర్గం దీనిని తీవ్రంగా నిరసించింది. జడ్పీటీసీ నామినేషన్ దాఖలు విషయంలో ఇరువర్గాల మధ్య ప్రారంభమైన వాగ్వాదం పరస్పరం దాడులకు దారితీసింది. ఘర్షణ తీవ్రరూపం దాల్చి పరిస్థితి అదుపు తప్పుతున్న సమయంలో టీడీపీ నేత, తిరుపతి ఎలైట్ ఆస్పత్రి అధినేత డాక్టర్ బాలసుబ్రమణ్యం తన వద్ద ఉన్న లైసెన్స్‌డ్ తుపాకీతో గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ ఆకస్మిక కాల్పుల ఘటన స్థలంలో తీవ్ర కలకలం రేపింది. ఈ క్రమంలో విధులు నిర్వర్తిస్తున్న స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ మనోజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆందోళనకారులు రెండు కార్లకు నిప్పుపెట్టి పూర్తిగా దగ్ధం చేయగా, పలు ద్విచక్రవాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడిలో పలువురు పోలీసులు సహా ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు అదనపు పోలీసు బలగాలను నందలూరుకు తరలించారు. ఆందోళనకారులను చెదరగొట్టి పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రణరంగాన్ని తలపించిన నందలూరులో ప్రస్తుతం పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

రైల్వే కోడూరు ఎంపీడీవో

కార్యాలయం వద్ద ఉద్రిక్తత.. వైయస్సార్‌సీపీ అభ్యర్థిపై దాడి



రైల్వే కోడూరు (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అనంతరాజుపేట 2వ స్థానానికి ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాలింకోట చంద్రయ్యపై జనసేన నాయకులు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. నామినేషన్ వేయకుండా అడ్డుకోవడమే కాకుండా, ఆయన చేతిలో ఉన్న నామినేషన్ పత్రాలను దుండగులు లాక్కుని బలవంతంగా చించేసారు. ఈ ఘటనపై బాధితుడు పాలింకోట చంద్రయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ వర్గానికి చెందిన తనపై నామినేషన్ కేంద్రం వద్దే ఇలా దాడికి పాల్పడటం అత్యంత దారుణమని ఆయన వాపోయారు. ప్రజాస్వామ్యయుతంగా నామినేషన్ వేయడానికి వస్తే భౌతిక దాడికి దిగి పత్రాలను ధ్వంసం చేయడంపై పలువురు విచారం వ్యక్తం చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద ఘర్షణ చెలరేగి ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు రంగప్రవేశం చేశారు. ఆందోళనకారులు మరియు గుంపుగా చేరిన వారిని లాఠీలతో తరిమికొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో స్థానికంగా భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

మార్కాపురం జిల్లాలో ఉద్రిక్తత

ఎర్రగొండపాలెంలో నామినేషన్ల వేళ టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ



ఎర్రగొండపాలెం (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : మార్కాపురం జిల్లా ఎర్రగొండపాలెం మండల కేంద్రంలో నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నామినేషన్ల పర్వం సందర్భంగా టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తెలుగుదేశం పార్టీ సభ్యులు నామినేషన్లు దాఖలు చేయగా, ఆ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు నామినేషన్లు వేయడానికి రావాలని అధికారులు సూచించినట్లు సమాచారం. అయితే, నిర్దేశిత సమయం ముగిసిన తర్వాత నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన వైసీపీ సభ్యులను అక్కడే గుమిగూడి ఉన్న టీడీపీ వర్గీయులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య ఒక్కసారిగా ఘర్షణ చెలరేగింది. పరిస్థితి మరింత తీవ్రతరం కావడంతో రంగంలోకి దిగిన పోలీసులు స్వల్ప లాఠీఛార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనపై వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తమ పార్టీ సభ్యులను నామినేషన్లు వేయకుండా టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారని, రక్షణ కల్పించాల్సిన పోలీసులు వారికి మద్దతుగా ఏకపక్షంగా వ్యవహరించారని వైసీపీ నేతలు ఆరోపించారు. ఎర్రగొండపాలెంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో స్థానికంగా భారీ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించండి ఎమ్మెల్యే కాలవ.



(తెలుగు కలం) అక్టోబర్ 22 : రాయదుర్గం మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా పోటీ చేస్తున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. పట్టణంలోని తన స్వగృహంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు మున్సిపల్ ఎన్నికల్లో జనసేనకు మూడు, బీజేపీకి రెండు వార్డులను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బీజేపీ తరఫున 9వ వార్డులో నాగరత్నమ్మ, 35వ వార్డులో భాగ్యమ్మ పోటీ చేస్తున్నారని వెల్లడించారు. జనసేన తరఫున కూడా ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలుస్తారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులతోపాటు బీజేపీ, జనసేన అభ్యర్థులను కూడా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు అందుతున్నాయని, తద్వారా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని కాలవ పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కూటమి పార్టీల ఐక్యతను చాటుతూ మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అభ్యర్థి టశీకశాల హనుమంతు, పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, బిజెపి నాయకురాలు వసుంధర దేవి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల కేంద్రం వద్ద రణరంగం!

గుంతకల్లులో వైసీపీ--టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ

పత్రాలు చించివేశారంటూ వైసీపీ ఆరోపణలు.. పోలీసుల లాఠీచార్జ్

డీఎస్పీ తీరుపై మహిళా అభ్యర్థి తీవ్ర అసంతృప్తి

గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 22 : ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గుంతకల్లులో రాజకీయ వేడిని రాజేసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. తమ పార్టీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను టీడీపీ నాయకులు లాక్కొని చించివేశారని వైసీపీ నాయకులు ఆరోపించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల మధ్య ఘర్షణ తీవ్రతరం కావడంతో పోలీసులు జోక్యం చేసుకుని లాఠీచార్జ్ చేసినట్లు సమాచారం. ఎన్నికల బరిలో నిలిచేందుకు వచ్చిన అభ్యర్థుల మధ్య నెలకొన్న ఈ పరిణామాలు స్థానికంగా కలకలం రేపాయి.గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కొనసాగుతున్న సమయంలో వివిధ గ్రామాలకు చెందిన అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా పోలీసులు అడ్డుకున్నారని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన తమ అభ్యర్థులను అడ్డుకోవడమే కాకుండా, కొందరి నామినేషన్ పత్రాలను బలవంతంగా తీసుకుని చించివేశారని వైసీపీ వర్గాలు ఆరోపించాయి. ఈ పరిణామంతో అక్కడికి చేరుకున్న ఇరుపార్టీల కార్యకర్తల మధ్య మాటామాటా పెరిగి తోపులాటకు దారితీసినట్లు తెలిసింది.

మూడు ప్రాంతాల అభ్యర్థుల పత్రాలు చించివేశారంటూ ఆరోపణలు :-

కసాపురం, నక్కనదొడ్డి, వెంకటంపల్లి ప్రాంతాలకు చెందిన వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని ఓ మహిళా అభ్యర్థి ఆరోపించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు అడ్డంకులు సృష్టించడం ఎంతవరకు



సమంజసమని ఆమె ప్రశ్నించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశంతో అవసరమైన పత్రాలతో వచ్చిన అభ్యర్థులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావడం బాధాకరమని వైసీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసుల తీరుపై ప్రశ్నలు.. డీఎస్పీపై విమర్శలు :-

ఘటన నేపథ్యంలో పోలీసుల వ్యవహారశైలిపై వైసీపీ మహిళా అభ్యర్థి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు సహా పోలీసు సిబ్బంది టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. నామినేషన్లు వేసేందుకు వచ్చిన తమ పార్టీ అభ్యర్థులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు, తమను అడ్డుకున్నారని విమర్శించారు. అయితే, డీఎస్పీపై చేసిన ఈ ఆరోపణలకు సంబంధించి పోలీసు శాఖ వివరణ వెలువడాల్సి ఉంది.



తోపులాట అదుపు తప్పడంతో పోలీసుల జోక్యం :-

ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత పెరగడంతో పోలీసులు రంగంలోకి దిగారు. నాయకులు, కార్యకర్తలను చెదరగొట్టేందుకు లాఠీచార్జ్ చేసినట్లు సమాచారం. ఈ తోపులాటలో ఇరుపార్టీలకు చెందిన కొందరికి స్వల్ప గాయాలైనట్లు



తెలిసినప్పటికీ, దీనిపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. ఘటనతో నామినేషన్ల కేంద్రం వద్ద కొంతసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ఎన్నికల నిర్వహణపై అధికారుల బాధ్యత ఏమిటి? :-

ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు చేసుకునే అవకాశం కల్పించడం, నామినేషన్ల కేంద్రం వద్ద శాంతిభద్రతలను కాపాడటం అధికార యంత్రాంగం బాధ్యత. ఈ నేపథ్యంలో అభ్యర్థుల నామినేషన్ పత్రాలు చించివేశారన్న ఆరోపణలపై అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. అభ్యర్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్ల ప్రక్రియ సాగిందా? ఘర్షణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? పోలీసుల చర్యలు ఏ కారణాలతో చేపట్టారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.మరోవైపు, వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలపై టీడీపీ నాయకులు, డీఎస్పీ శ్రీనివాసరావు, సంబంధిత పోలీసు అధికారులు ఇప్పటివరకు తమ వివరణ ఇవ్వాల్సి ఉంది. అధికారిక స్పందన వెలువడిన తర్వాతే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, పరిశీలకుల సమీక్ష

అల్లూరి సీతారామరాజు (తెలుగు కలం) అక్టోబర్ 22 :ప్రతినిధి : అల్లూరి సీతారామరాజు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఈ ఎన్నికలను సమర్థవంతంగా పూర్తి చేయడానికి ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు **(RO\T),** నోడల్ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీమతి నిషాంతి టి. ఆదేశించారు. పాడేరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలు, ఎన్నికల నియమావళి అమలు తదితర కీలక అంశాలపై స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అలాగే అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను



తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, ఏర్పాట్ల పురోగతిపై ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, రాత్రి 9 గంటలకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, సంబంధిత అధికారులు సమయానికి హాజరై ప్రగతి నివేదికలను అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల జిల్లా పరిశీలకులు, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ శ్రీ రోణంకి కూర్మనాథ్, ఐఏఎస్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ విజయవంతం కావడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలందరూ నియమ నిబంధనలను గౌరవించి పాటించాలని కోరారు. నామినేషన్ల స్వీకరణ నుండి ప్రక్రియ పూర్తయ్యే వరకు చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా ప్రతి దశలోనూ నిబంధనలు పాటించాలన్నారు. విధుల నిర్వహణలో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి తిరుమణి శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీ ఆదిత్య వర్మ, పాడేరు సబ్ కలెక్టర్ శ్రీ కనాల చిరంజీవి నాగ వెంకట సాహిత్, అదనపు ఎస్పీ శ్రీమతి శ్రుతి, అలాగే వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లా పొదిలిలో ఉద్రిక్తత.. ఒంగోలు కర్నూలు ప్రధాన రహదారిపై వైఎస్సార్‌సీపీ ఆందోళన

పొదిలి (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : మార్కాపురం జిల్లా పొదిలి పట్టణంలో నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా తమకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ వారు ఒంగోలు--కర్నూలు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమూహంగా వెళ్లి నామినేషన్లు దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని, లేదా అభ్యర్థులు నామినేషన్ వేసి తిరిగి వచ్చే వరకు పోలీసులు పూర్తి భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు స్వయంగా రోడ్డుపై బైఠాయించడంతో పరిస్థితి మరింత



ఉద్రిక్తంగా మారింది. ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నిరసనలో పాల్గొనడంతో ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నామినేషన్ కేంద్రం వద్ద అనుమతులు ఉంటాయని, నిబంధనలకు విరుద్ధంగా గుంపుగా వెళ్లేందుకు అనుమతించడం సాధ్యం కాదని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనల మేరకు సహకరించాలని కోరారు. అయితే తమ అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసే వరకు భద్రత కల్పించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టుబట్టారు. పోలీసులు, ఆందోళనకారుల మధ్య పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ సమస్య వెంటనే పరిష్కారం కాకపోవడంతో ఉద్రిక్తత కొనసాగింది. దాదాపు గంటకు పైగా అన్నా రాంబాబు అనుచరులు రహదారిపైనే బైఠాయించడంతో పొదిలిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మరోవైపు ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు ట్రాఫిక్ చర్యలు చేపట్టారు.

పదో తరగతి ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహక బహుమతులు

పెద్దవడుగూరు (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించి, పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా చిత్రచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో హిందీ సబ్జెక్టులో అత్యుత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయురాలు జి. విజయమేరి ఈ ప్రోత్సాహక బహుమతులను అందించారు. పెద్దవడుగూరు మండలం చిత్రచేడు గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ సబ్జెక్టులో డి. నజీర్ భాషా 100 మార్కులకు గాను 98 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. బి. హర్షలేఖ 97 మార్కులు, వి. విశాల 96 మార్కులు సాధించి ప్రశంసలు అందుకున్నారు. ఈ ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున మొత్తం రూ.6,000 నగదు బహుమతులను ఉపాధ్యాయురాలు జి. విజయమేరి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివశంకర్ రెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల



సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు, ఇతర విద్యార్థులు కూడా చదువులో రాణించేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఉపాధ్యాయ బృందం అభిప్రాయపడింది. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కేవలం మార్కులు సాధించడమే కాకుండా జ్ఞానం, వివేకం, సంస్కారాలను అలవర్చుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. 2026--27 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఈ బహుమతులు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని ప్రధానోపాధ్యాయులు శివశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల విజయాన్ని గుర్తించి నగదు ప్రోత్సాహక బహుమతులు అందించిన హిందీ ఉపాధ్యాయురాలు జి. విజయమేరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సహ ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపునకు, మెరుగైన ఫలితాల సాధనకు దోహదపడతాయని వారు పేర్కొన్నారు.

పెద్దపప్పూరులో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్

అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు -- 2026కు సంబంధించి పెద్దపప్పూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఈ ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. పరిశీలనలో భాగంగా ఎంపిడిఓ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటన, నోటీస్ బోర్డు ఏర్పాటు, సీసీటీవీ కెమెరాల నిఘా, మరియు సెక్యూరిటీ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను నిర్ణీత సమయంలోగా అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో శాంతిభద్రతల పరంగా ఎలాంటి భద్రతా సమస్యలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా నామినేషన్ల చివరి రోజు చివరి గంటల్లో ఎలాంటి గందరగోళం లేదా ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా నామినేషన్ల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ)

మరియు పోలీసు అధికారులతో చర్చించి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, పెద్దపప్పూరు ఎంపీడీవో, డిఎం మార్క్వెడ్ మరియు ఎన్నికల అధికారి పెన్నేశ్వరి, తహసీల్దార్ బాలాజీ రాజు, ఇతర ఎన్నికల సిబ్బందితో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 23 - 10 - 2026

చంద్రగిరిలో తీవ్ర ఉత్కంఠ.. ఎమ్మెల్యే పులివర్తి నాని హౌస్ అరెస్ట్

తిరుపతి/చంద్రగిరి (తెలుగు కలం) అక్టోబర్ 22 :ప్రతినిధి : స్థానిక సంస్థల (ఎంపీటీసీ, జడ్పీటీసీ) నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా భగ్గుమంది. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నానిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ మేరకు తిరుపతి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) స్వయంగా ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని అధికారికంగా నోటీసులు అందజేశారు. అక్టోబర్ 21న ప్రారంభమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల దాఖలు సందర్భంగా నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతల దృష్ట్యా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 అమల్లో ఉందని నోటీసులో స్పష్టం చేశారు. అందువల్ల ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలగకుండా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 168 కింద ముందస్తు నివారణ చర్యగా ఈ నోటీసు జారీ చేస్తున్నట్లు పేర్కొంటూ, అందులోని



ఆదేశాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎమ్మెల్యేకు సూచించారు. గృహనిర్బంధానికి ముందు ఎమ్మెల్యే పులివర్తి నాని నిర్వహించిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలపై ప్రత్యర్థులు దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల సమయంలో తనపై దాడి జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఈ నెల 13వ తేదీ రాత్రి కూడా తనపై హత్యాయత్నానికి ఒంగోలు కేంద్రంగా కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ ముప్పుపై పోలీసు ఉన్నతాధికారులకు ముందస్తుగానే లిఖితపూర్వకంగా సమాచారం అందించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుంటూ పులివర్తి నాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగుతున్నప్పటికీ, కూటమి నాయకులే అడ్డుకుంటున్నట్లు చిత్రీకరిస్తూ తప్పుడు కేసులు బనాయించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ పరిణామాలపై తిరుపతి కలెక్టరేట్ వద్ద నిరసనలు, ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే హౌస్ అరెస్ట్‌తో చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసు అధికారులు స్పష్టం చేస్తుండగా, కూటమిపై అక్రమ కేసులు బనాయించే కుట్రలను తిప్పికొడతామని కూటమి శ్రేణులు పేర్కొంటున్నాయి.

అనంతపురంలో 'సిఐఐ భాగస్వామ్య సమిట్ 2026' రీజనల్ కాన్ఫరెన్స్

పక్కాగా ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఆ్రా జుణదీ) మరియు భారత పరిశ్రమల సమాఖ్య (CII) సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "సిఐఐ పార్ట్‌నర్ షిప్ సమిట్ - 2026" రీజనల్ కాన్ఫరెన్స్‌కు అనంతపురం వేదికవుతోంది. శుక్రవారం (అక్టోబర్ 23) జరగనున్న ఈ ప్రాంతీయ సదస్సుకు సంబంధించి నగరంలోని జేఎన్టీయూ ప్రాంగణంలో ఉన్న ఎన్టీఆర్ ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తదితర జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సదస్సుకు హాజరయ్యే విదేశీ, స్వదేశీ ప్రతినిధులు, పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఇతర అనుబంధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సదస్సు ప్రాంగణంలో ఏపీ పెవిలియన్, ఎంఎస్ఎంఈ స్టాల్స్, టెక్నాలజీ మరియు ప్రొడక్ట్ ప్రదర్శనలు పక్కాగా తీర్చిదిద్దాలని, పార్కింగ్ మరియు విందు ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని చెప్పారు. రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రాముఖ్యత కలిగిన ఉత్పత్తుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని తెలిపారు.

రీజనల్ కాన్ఫరెన్సుల షెడ్యూల్ - పురోగతి:

రాష్ట్రవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు అక్టోబర్ 7 నుంచి 26 వరకు వివిధ ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నారు.



అక్టోబర్ 7 (విశాఖపట్నం):

ఏఐ, డేటా సెంటర్లు, ఐటీ, ఫిన్‌టెక్, సెమీకండక్టర్లు, ఫార్మా రంగాలు.

అక్టోబర్ 12 (కాకినాడ):

మారిటైమ్, కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్, ఆక్వా ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్.

అక్టోబర్ 16 (గుంటూరు):

గవర్నెన్స్, రాజధాని నగర అభివృద్ధి, క్వాంటమ్ వ్యాలీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్.

అక్టోబర్ 23 (అనంతపురం):

ఏరోస్పేస్, డిఫెన్స్, ఆటోమోటివ్, సహజ వ్యవసాయం, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం.

అక్టోబర్ 26 (తిరుపతి):

టూరిజం, హాస్పిటాలిటీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్, సెమీకండక్టర్స్, స్పేస్, ఫుట్‌వేర్ రంగాలు. ఈసారి రీజనల్ కాన్ఫరెన్స్‌లలోనే పలు అవగాహన ఒప్పందాలు (వీశీఖం) కుదుర్చుకునేలా ప్రత్యేక మార్పులు చేశారు.

కాన్ఫరెన్స్ ముఖ్యాంశాలు ఎజెండా:

అక్టోబర్ 23న ఉదయం 10:30 గంటలకు ఏపీ షోకేస్ మరియు ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్‌తో సదస్సు ప్రారంభమవుతుంది. ఉదయం 11:15 గంటలకు ప్రారంభోత్సవ సమావేశం, మధ్యాహ్నం 12:30 గంటలకు కీలక పెట్టుబడి ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయి. మధ్యాహ్నం 1:00 గంటలకు పలు ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం 1:30 గంటలకు నెట్‌వర్కింగ్ లంచ్ నిర్వహిస్తారు.

హాజరుకానున్న ముఖ్య ప్రముఖులు:

రాయలసీమ జిల్లాల పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేలా నిర్వహించే ఈ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి, ఏపీఐఐసీ ఎండి దినేష్ కుమార్, ఏపీఈడిబి సీఈఓ సగిలి షమ్మోహన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభం బన్సల్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ విశ్వతో పాటు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, జేఎన్టీయూ విసి తదితర ముఖ్య అధికారులు పాల్గొంటారు. పరిశీలన కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్, ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, ఆర్డీఓ ప్రేమంతకుమార్, ఐఅండ్ పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

హిందూపురంలో ఉద్రిక్తత ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్

ఉపసంహరణపై మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన





హిందూపురం (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఊహించని పరిణామం తీవ్ర కలకలం రేపింది. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ అభ్యర్థి వెంకట రంగప్ప నామినేషన్ ఉపసంహరణ వివాదస్పదంగా మారింది. తమకు తెలియకుండా, తమ ప్రమేయం లేకుండా నామినేషన్‌ను ఏ విధంగా ఉపసంహరిస్తారంటూ వెంకట రంగప్ప వర్గీయులు, మద్దతుదారులు మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట తీవ్ర స్థాయిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మరియు వారి వర్గీయులు మాట్లాడుతూ, తాము రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీలోనే ఉంటామని స్పష్టం చేశారు. తమ అనుమతి లేకుండా నామినేషన్లను అధికారులు ఏ ప్రాతిపదికన, ఏవిధంగా తొలగించారో తక్షణమే స్పష్టమైన సమాధానం చెప్పాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అభ్యర్థి మద్దతుదారులు, తమకు న్యాయం జరగకపోతే అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధపడతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఈ అకస్మాత్తు ఆందోళనతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకుంది. ఈ విషయమై అధికారులు స్పందించి తగిన విచారణ చేపట్టి న్యాయం చేయాలని స్థానిక నాయకులు, అనుచరులు కోరుతున్నారు.

కొన్ని ఘటనలు మినహా....

ప్రశాంతంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ





అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 22 : అనంతపురం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొన్నిచోట్ల చెదురుమదురు ఘటనలు మినహా అంతటా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్ (ఐఏఎస్), జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు (ఐఎఫ్ఎస్) తెలిపారు. గురువారం అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వారు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారుల బృందం, ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని వివరించారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన అన్ని రకాల వసతులు, సౌకర్యాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అక్కడి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల వ్యయ పరిమితుల గురించి స్పష్టం చేస్తూ, ఈ ఎన్నికల్లో జెడ్పీటీసీ అభ్యర్థి గరిష్టంగా రూ. 8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి రూ. 4 లక్షలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, నామినేషన్ల ఘట్టం సజావుగా సాగేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సీపీఓ బాలాజీ నాయక్ తో పాటు ఇతర కీలక అధికారులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో వైసీపీకి భారీ షాక్.. టీడీపీలోకి కీలక నాయకులు



కదిరి (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలానికి చెందిన పలువురు కీలక నాయకులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వీరంతా టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలోకి అడుగుపెట్టగా, ఎమ్మెల్యే వారికి సాదరంగా పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నల్లచెరువు మాజీ ఎంపీపీ రమణారెడ్డి, జడ్పీటీసీ భర్త బసిరెడ్డి విశ్వనాథరెడ్డి, ఉబి జర్ల మాజీ సర్పంచ్ కుమారుడు సమీవుల్లా, తవళంమర్రి మాజీ సర్పంచ్ సుధాకర్, తవళంమర్రి మాజీ ఎంపీటీసీ లక్ష్మీపతి యాదవ్, నల్లచెరువు సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ జయచంద్రారెడ్డితో పాటు అంజనప్ప నాయక్, చంద్ర నాయక్, మహదేవ మోహన్ రెడ్డి, మహాదేవ రెడ్డి తదితరులు అధికారికంగా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలోకి చేరిన నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యామని తెలిపారు. కదిరి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేస్తున్న కృషిపై నమ్మకంతోనే తాము తెలుగుదేశం పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తామని, రాబోయే రోజుల్లో మండల స్థాయిలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లచెరువు మండల కన్వీనర్ రాజశేఖర్‌తో పాటు మండల కమిటీ నాయకులు, పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి లో రాజకీయ ఉద్రిక్తత కూటమి, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ





బత్తలపల్లి (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద తీవ్ర రాజకీయ ఉద్రిక్తత చోటుచేసుకుంది. అధికార కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) మరియు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కార్యకర్తలు, నాయకుల మధ్య ఆకస్మికంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం.. బత్తలపల్లి సర్కిల్/కూడలి ప్రాంతంలో ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఒకే సమయంలో ఎదురెదురుపడటంతో వివాదం ప్రారంభమైంది. మొదట ఇరు పక్షాల మధ్య మాటల యుద్ధం చెలరేగగా, అది క్రమంగా తీవ్రస్థాయికి చేరి తోపులాట మరియు పరస్పర దాడులకు దారితీసింది. పాయింట్ కూడలి వద్ద ఇరువర్గాల మధ్య గందరగోళం, తీవ్ర నినాదాలు చోటుచేసుకోవడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర తీవ్రభయాందోళనలకు గురయ్యారు. కొద్దిసేపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు వేగంగా స్పందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాలు ఎంతకీ శాంతించకపోవడంతో, అదనపు బలగాలతో రంగంలోకి దిగిన పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఇరువర్గాల నాయకులను, శ్రేణులను లాఠీఛార్జ్/చెదరగొట్టి పరిస్థితిని పూర్తిగా తమ అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనతో బత్తలపల్లి మండల కేంద్రంలో వాతావరణం వేడెక్కింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీసులు కూడలి పరిసర ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఈ ప్రాంతంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నారు.

సిపిఎం నాయకులపై ప్రత్యర్థుల దాడి

ఎంపీటీసీ నామినేషన్ వెళ్తుండగా రాళ్లదాడి, తీవ్రంగా గాయపడ్డ ఆవులయ్య గిద్దలూరు ఆస్పత్రికి తరలింపు



కొమరోలు (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : మార్కాపురం జిల్లా కొమరోలు మండలంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ వేసేందుకు వెళ్తున్న సిపిఎం పార్టీ నాయకులపై ప్రత్యర్థులు అకస్మాత్తుగా రాళ్లతో దాడికి పాల్పడ్డారు. సమాచారం ప్రకారం, కొమరోలు మండలానికి చెందిన సిపిఎం నాయకులు ఆవులయ్య, అంజమ్మలతో పాటు మరొక నేత కలిసి ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో వీరి మార్గమధ్యంలో కొందరు వ్యక్తులు ఒక్కసారిగా వారిపై రాళ్లతో దాడికి దిగారు. ఈ దాడిలో సిపిఎం నాయకుడు ఆవులయ్య తీవ్రంగా గాయపడ్డారు. అంజమ్మ సహా మిగిలిన నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రక్తగాయాలతో పడివున్న ఆవులయ్యను తోటి నాయకులు, స్థానికులు వెంటనే సమీపంలోని గిద్దలూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆయనకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఎన్నికల నామినేషన్ల వేళ ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేయడానికి వెళ్తున్న తమపై ప్రత్యర్థులు కావాలనే ఈ కుట్రపూరిత దాడికి ఒడిగట్టారని సిపిఎం శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని, దాడికి పాల్పడిన వారి కోసం దర్యాప్తు ప్రారంభించారు.

వైఎస్సార్‌సీపీతోనే అనంతపురం అభివృద్ధి

మేయర్ అభ్యర్థి బీసీ రమేష్ గౌడ్



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : అనంతపురం నగర ప్రగతి, సమగ్ర అభివృద్ధి కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని ఆ పార్టీ మేయర్ అభ్యర్థి బీసీ రమేష్ గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన అనంతపురం నగరంలోని బంగారు వీధి, పాత ఊరు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ప్రచారంలో భాగంగా బీసీ రమేష్ గౌడ్ మాట్లాడుతూ, అనంతపురం నగరాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత నగరవాసులందరిపై ఉందన్నారు. నగరంలో సుదీర్ఘకాలంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు, రాబోయే రోజుల్లో సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పనిచేస్తుందని హామీ ఇచ్చారు. నగర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు వైఎస్సార్‌సీపీకి ఒక్క అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో ప్రతిపక్షాల తీరుపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పక్క నియోజకవర్గాల నుంచి మంత్రులు, ఇతర నాయకులు అనంతపురంలో వాలిపోయి, ఎన్నికల ప్రచారంలో గందరగోళ పరిస్థితులు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో సొంత నియోజకవర్గమైన ధర్మవరాన్నే సరైన రీతిలో అభివృద్ధి చేయలేకపోయిన మంత్రి, ఇప్పుడు అనంతపురానికి వచ్చి ఏం అభివృద్ధి చేస్తారని ప్రశ్నిస్తూ ఘాటు విమర్శలు చేశారు. అనంతపురం నగర భవిష్యత్తు మరియు ప్రగతిని దృష్టిలో ఉంచుకుని ప్రజలంతా ఆలోచించి విచక్షణతో ఓటు వేయాలని బీసీ రమేష్ గౌడ్ కోరారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి ఆదరించాలని ఆయన ప్రజలను కోరారు.

ధోనిముక్కల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

బైక్‌ను ఢీకొన్న కారు.. తండ్రి, ఆరేళ్ల కుమారుడు మృతి

భార్యకు తీవ్ర గాయాలు.. అనంతపురానికి తరలింపు





గుంతకల్లు,(తెలుగు కలం) అక్టోబర్ 22 : అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం ధోనిముక్కల సమీపంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో తండ్రి రమేష్, ఆయన ఆరేళ్ల కుమారుడు మోక్షిత్ మృతి చెందారు.రమేష్ భార్య గీత తీవ్రంగా గాయపడింది. ఆమెను మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ఈ ఘటనతో బాధిత కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ నుంచి గుంతకల్లుకు బైక్‌పై వస్తున్న రమేష్ కుటుంబాన్ని,గుంతకల్లు నుంచి ధోనిముక్కల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో రమేష్, ఆయన కుమారుడు మోక్షిత్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.తీవ్రంగా గాయపడిన గీతను చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి పంపించారు. ప్రమాదానికి కారణమైన కారును కానిస్టేబుల్ శివ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.అయితే ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.సమాచారం అందుకున్న గుంతకల్లు రూరల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.తండ్రి, కుమారుడు మృతి చెందడంతో ధోనిముక్కల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుల బంధువుల రోదనలు పలువురిని కలచివేశాయి.

స్థానిక సంస్థల నామినేషన్లలో రణరంగంగా మారిన రాప్తాడు

టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య రాళ్ల దాడి, తీవ్ర ఉద్రిక్తత





రాప్తాడు (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ఘట్టం తీవ్ర ఘర్షణలకు వేదికైంది. నామినేషన్ల దాఖలు ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలైన తెలుగుదేశం (టీడీపీ), వైఎస్సార్ కాంగ్రెస్ (వైసీపీ) శ్రేణుల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు భగ్గుమన్నాయి. ఇరు వర్గాలు పరస్పరం రాళ్లదాడికి దిగడంతో రాప్తాడు పరిసర ప్రాంతాలు ఒక్కసారిగా రణరంగాన్ని తలపించాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు బయలుదేరిన సమయంలో ఈ ఘర్షణ చోటుచేసుకుంది. ఆమె నామినేషన్ కేంద్రానికి చేరుకుంటున్న మార్గమధ్యంలో ఇరు పార్టీల మద్దతుదారులు, నాయకులు భారీ సంఖ్యలో మోహరించి, ఒకరికొకరు పోటీగా నినాదాలు చేసుకున్నారు. ఈ క్రమంలో మాటమాట పెరిగి, పరస్పర తోపులాటలు మరియు రాళ్ల దాడికి దారితీసింది. రాళ్ల దాడి కారణంగా పలు వాహనాల అద్దాలు ధ్వంసమవ్వడమే కాకుండా ఇరువర్గాలకు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడ్డారు. ఉద్రిక్త సమయం కావడం మరియు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ఇరు వర్గాలను చెదరగొట్టేందుకు తీవ్రంగా యత్నించారు. ప్రాథమికంగా పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినప్పటికీ, రాప్తాడు పరిసర ప్రాంతాల్లో ఇంకా హైటెన్షన్ వాతావరణం కొనసాగుతోంది. నామినేషన్ల కేంద్రం వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అదనపు బలగాలను మోహరించి నిరంతర నిఘా ఏర్పాటు చేశారు.

దేవరగట్టు కర్రల సమరంలో చిందిన రక్తం

ఒకరు మృతి, 100 మందికి పైగా గాయాలు

ఏపీలోని కర్నూలు జిల్లా దేవరగట్టులో 'బన్ని' పండుగ సందర్భంగా హింస చెలరేగింది

ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, 100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా దేవరగట్టులో 'బన్ని' ఉత్సవం సందర్భంగా హింస చెలరేగింది. కర్రల సమరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాల మల్లేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు సందర్భంగా నిర్వహించే బన్ని ఉత్సవం రణ రంగాన్ని తలపించింది. శోభాయాత్ర జరుగుతున్న సమయంలో అర్ధరాత్రి దాటాక ఈ హింస చెలరేగింది. గ్రామస్తులు ఒకరిపై ఒకరు కక్షపూరితంగా రాళ్లు, కర్రలు, దివిటీలతో తలపడడంతో సుమారు వందమందికి పైగా గాయపడ్డారు. కర్రలతో జరిగిన దాడిలో ఆలూరుకు చెందిన పోతురాజు (28) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. గాయపడిన వారిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మరోవైపు దేవరగట్టులో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. 1000 మంది పోలీసులు ఉన్నప్పటికీ కర్రల సమరాన్ని ఆపలేక నిస్సహాయ స్థితిలో ఉండి పోయారు.కర్నూలు జిల్లాలోని హోళగుంద మండలం దేవరగట్టు బన్ని ఉత్సవంలో మరోసారి హింస చెలరేగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత శ్రీ మాల మల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు సందర్భంగా నిర్వహించే బన్ని ఉత్సవంలో మరోసారి తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. నేరనికి, నేరనిక తండా, కొత్తపేట గ్రామస్తులు స్వామివారి ఉత్సవ మూర్తులను కొండపై నుంచి కిందికి తీసుకొస్తున్న సమయంలో ఆలూరు, అరికెర, ఎల్లార్తి తదితర గ్రామస్తులు కర్రలతో ఎదురుగా తలపడ్డారు. ఇది సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్న ఉత్సవం అని భావించిన పోలీసులకు, వారి ఎదురుగానే రణరంగాన్ని తలపించే విధంగా దాడులు ప్రతిదాడులతో స్థానికులు రెచ్చిపోవడం కనిపించింది. లక్ష మంది వరకు ఆయా గ్రామస్తులు పాల్గొనగా, దాదాపు 30 వేల మంది కర్రల సమరంలో పాల్గొన్నారు.కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసులను మోహరించినప్పటికీ, ఆ కర్రల సమరాన్ని నిలువరించలేకపోయారు. సంప్రదాయబద్ధంగా సాగే కర్రల సమరం కాస్త, ప్రతీకార దాడులగా మారడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పలు గ్రామస్తులు ఒకరిపై ఒకరు దివిటీలు ఉద్దేశపూర్వకంగా విసిరేసు కోవడంతో అనేక మంది మహిళలు గ్రామస్తులు, యువకులు గాయాలపాలయ్యారు. కొంతమంది పోలీసులు గాయపడ్డారు. దాదాపు రెండు గంటలపాటు రణరంగం కొనసాగింది. మరికొంత మంది కర్రల దాడిలో ఉద్దేశపూర్వకంగా కింద పడేసి కొట్టడం, తోపులాట, తొక్కిసలాట జరగడంతో పలువురు గాయపడ్డారు. ప్రాథమిక సమాచారం మేరకు దాదాపు 100 మందికి పైగానే గాయపడినట్లు అంచనా.గాయపడిన వారందరినీ దేవరగట్టులోని ప్రాథమిక వైద్య శిబిరంలో ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న వారిని అంబులెన్స్‌లో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ కర్రల సమరంలో ఆలూరు ప్రాంతానికి చెందిన పోతురాజు అనే వ్యక్తి ఊపిరాడక చనిపోయినట్లు డాక్టర్లు చెబుతున్నారు. మరింత మందికి తీవ్ర గాయలయ్యాయి. కళ్ల ఎదుట కర్రల సమరం, రాళ్లదాడి జరుగుతున్నప్పటికీ తక్కువ మంది పోలీసులు ఉండడంతో నిస్సహాయ స్థితిలో జిల్లా ఎస్పీ ఉండిపోయారు."ఈ ఏడాది జరిగిన బన్ని ఉత్సవాల్లో చాలామంది తీవ్రంగా గాయపడ్డారు. ఒకరు ప్రాణాలు కోల్పోయారు. గాయాలతో వచ్చిన వారికి ప్రథమ చికిత్స చేశాం. వారిలో చాలామందికి చెవులు, ముక్కు లేదా తల నుంచి రక్తస్రావం అవుతోంది. ప్రథమ చికిత్స చేసిన తర్వాత, మెరుగైన వైద్యం కోసం వారిని ఆదోనికి తరలించాం".జిల్లా ఎస్పీ కంట్రోల్ రూమ్‌లో మైకుల ద్వారా హెచ్చరించినప్పటికీ, బన్ని ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు లెక్క చేయలేదు. పరిస్థితి అదుపుతప్పి గతంలో లేని విధంగా పెద్ద సంఖ్యలో దివిటీలను గ్రామస్తులు ఒకరిపై ఒకరు విసిరేసుకోవడంతో పరిస్థితి మరింత చేయి దాటిపోయింది. చివరి నిమిషంలో గత్యంతరం లేక స్పెషల్ పార్టీ పోలీసులు హెల్మెట్లతో గుంపు మధ్యలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ జరగాల్సిన నష్టం అప్పటికే జరిగిపోయింది. పరిస్థితి ఉద్రిక్తంగానే కొనసాగుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

హైదరాబాద్‌కు తిరుగుముఖం పట్టిన జనం

నగరంలో ఫుల్ ట్రాఫిక్ జామ్

పండుగ సెలవుల తర్వాత జిల్లాల నుంచి లక్షలాది ప్రజలు హైదరాబాద్ నగరానికి తిరిగి వస్తుండటం, నగరంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జన వేడుకలు జరుగుతుండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది



దసరా పండుగ ముగించుకొని సొంతూళ్ల నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవైపు పండుగ సెలవుల తర్వాత జిల్లాల నుంచి లక్షలాది మంది ప్రజలు నగరానికి తిరిగి వస్తుండటం, మరోవైపు నగరంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జన వేడుకలు జరుగుతుండటంతో హైదరాబాద్ వ్యాప్తంగా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలకు విగ్రహాలు భారీగా తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోలేక ట్రాఫిక్‌లో తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఇవాళ ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు హైదరాబాద్‌లోని కీలక రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముఖ్యంగా ఎల్బీనగర్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వెళ్లే మార్గంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీన్ని నియంత్రించేందుకు విజయవాడ, నల్గొండ, ఖమ్మం జిల్లాల నుంచి వస్తున్న ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులకు ఎంజీబీఎస్ వైపు వెళ్లొద్దని పోలీసులు సూచిస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోనే దిగిపోవాలని ప్రయాణీకులకు స్పష్టం చేస్తున్నారు. అలాగే కూకట్‌పల్లి, మియాపూర్, పటాన్‌చెరు వైపు వెళ్లే బస్సులను మళ్లిస్తున్నారు. కూకట్‌పల్లి వైపు వెళ్లే వాహనాలను ఉప్పల్, జేబీఎస్ మీదుగా వెళ్లాలని చెబుతున్నారు.వాహనాల రద్దీ విపరీతంగా పెరగడంతో పరిస్థితిని అదుపు చేయడానికి కొన్ని చోట్ల ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా బస్సుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు ట్రాఫిక్ పోలీసులు క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్నారు. అయినప్పటికీ దసరా సెలవుల ముగుంచుకొని నగరానికి వస్తున్న లక్షలాది మంది ప్రజలు ఒక్కసారిగా రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ గందరగోళం తప్పదం లేదు. దీంతో సొంత ఊర్లలో పండుగను సంతోషంగా నిర్వహించుకొని, తిరిగి నగరంలో అడుగుపెట్టిన సామాన్యుడికి ఈ ట్రాఫిక్ కష్టాలు పెద్ద పరీక్షగా మారాయి. తీవ్రంగా రద్దీ నెలకొన్న ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ దారులను చూసుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

పదేళ్ల పార్టీ సేవకు గుర్తింపు కోరుతున్న బండి లక్ష్మీదేవి

12వ వార్డు టికెట్ మార్పుపై ఆవేదన.. నాయకుల జోక్యంతో బీ-ఫామ్ అందిందని వెల్లడి

న్యాయం కోసం అవసరమైతే కోర్టుకు వెళ్తానని ప్రకటన

గుంతకల్లు, (తెలుగు కలం) అక్టోబర్ 22 : తెలుగుదేశం పార్టీ కోసం పదేళ్లుగా పనిచేస్తున్న తనకు మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ టికెట్ కేటాయింపు విషయంలో చివరి నిమిషంలో మార్పు జరిగిందని గుంతకల్లు 12వ వార్డు టీడీపీ అభ్యర్థి బండి లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత తనకే టికెట్ ఖరారైందని సమాచారం ఇచ్చి, ఆ తర్వాత మరో వ్యక్తికి పార్టీ అధికారిక అభ్యర్థిత్వ పత్రం (బీ-ఫామ్) ఇచ్చారని తెలిపారు. పార్టీ నాయకుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో చివరకు తనకు బీ-ఫామ్ అందిందని పేర్కొన్నారు. కౌన్సిలర్‌గా పోటీ చేసే అవకాశం కల్పించాలని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు.

పార్టీ కష్టకాలంలోనూ పనిచేశా

2014 నుంచి టీడీపీలో కొనసాగుతున్నానని, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నానని లక్ష్మీదేవి తెలిపారు. బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, శంఖారావం, బాబు ష్యూరిటీ--భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు వివరించారు. చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో నిర్వహించిన నిరసనలు, నిరాహార దీక్షల్లోనూ పాల్గొన్నానని చెప్పారు. 12వ వార్డులో మహిళలు, స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానని తెలిపారు. పార్టీ కోసం పదేళ్లుగా పనిచేసిన తనకు ఈసారి కౌన్సిలర్‌గా పోటీ చేసే అవకాశం వస్తుందని ఆశించానన్నారు.

చివరి నిమిషంలో టికెట్ మార్పు

12వ వార్డు టికెట్ తనకే ఖరారైందని ముందురోజు రాత్రి వరకు సమాచారం ఇచ్చారని లక్ష్మీదేవి తెలిపారు. 18 మందితో కూడిన అభ్యర్థుల జాబితాలోనూ తన పేరు ఉందని పేర్కొన్నారు. అయితే అక్టోబర్ 22న బీ-ఫామ్ తీసుకునే సమయంలో తనకు బదులుగా గాజుల వెంకటేష్‌కు బీ-ఫామ్ ఇచ్చినట్లు తెలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్, శ్రీనాథ్ గౌడ్ తదితర నాయకుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు జోక్యంతో చివరకు తనకు బీ-ఫామ్ అందిందని వెల్లడించారు.

న్యాయం కోసం పోరాటం

పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉండాలని లక్ష్మీదేవి అన్నారు. 12వ వార్డు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. తనకు జరిగిన పరిణామాలపై న్యాయం జరగకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు కూడా వెనుకాడబోనని స్పష్టం చేశారు. టికెట్ కేటాయింపుపై లక్ష్మీదేవి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ అధిష్టానం, ఎన్నికల కమిషన్ స్పందన తెలియాల్సి ఉంది.

కడప జిల్లాలో ఉద్రిక్తత వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్టు



ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు రెండోరోజూ గురువారం నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. కడప జిల్లాలో ఇవాళ కూడా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. బుధవారం కడప జిల్లా పరిషత్ కార్యాలయానికి ఎంపీ అవినాష్ రెడ్డితో పాటు ర్యాలీగా వచ్చిన వైఎస్సార్సీపీ కార్యకర్తలు పోలీసులపై రాళ్లదాడి చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.ముందస్తు చర్యల్లో భాగంగా వైఎస్సార్సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ మేయర్ పాకా సురేశ్ తదితరులను కడపలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పులివెందులలోని అవినాష్‌రెడ్డి నివాసానికి తరలించారు. అక్కడే గృహ నిర్బంధం చేశారు. చాపాడులో వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. నామినేషన్ పత్రాలు చించివేశారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు పెంచారు.జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలం గుండ్లకుంట గ్రామంలో రోడ్డుపై వాహనాలు అడ్డంగా పెట్టడంతో నామినేషన్లు వేసేందుకు పార్టీ శ్రేణులతో కలిసి వెళ్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆయన సతీమణి ఇందిరమ్మ రోడ్డుపై బైఠాయించారు.మరోవైపు ఒంటిమిట్టలో టీడీపీ-వైఎస్సార్సీపీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లెలో వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మండలంలోని ముఖ్యమైన టీడీపీ, వైఎస్సార్సీపీ నాయకులను వారి ఇళ్ల వద్ద పోలీసులు నిర్బంధించారు.జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు గుంపుగా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అదే సమయంలో పోలీసు భద్రత మధ్య నామినేషన్ కేంద్రానికి వెళ్తున్న వైఎస్సార్సీపీ అభ్యర్థులపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు విసిరారు. వైఎస్సార్సీపీ శ్రేణులు తిరిగి రాళ్లు రువ్వడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.ఒంటిమిట్టలో టీడీపీ, వైఎస్సార్సీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లెలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. మండలంలోని ఇరు పార్టీలకు చెందిన ముఖ్య నేతలను వారి ఇళ్ల వద్దే నిర్బంధించారు.

పెద్దవడుగూరులో పటిష్ట భద్రతా వలయంలో నామినేషన్ల కేంద్రాలు



పెద్దవడుగూరు (తెలుగు కలం) అక్టోబర్ 22 :ప్రతినిధి : స్థానిక సంస్థల పరిధిలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేపథ్యంలో అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఈ ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా, ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడమే లక్ష్యంగా భద్రతా బలగాలను మోహరించారు. నామినేషన్ల సమర్పణ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ (సీఐ) నరేందర్ రెడ్డి, సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్ఐ) రాఘవేంద్రప్పల ప్రత్యక్ష ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది భద్రతా పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కేంద్రాల వద్ద తోపులాటలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ, అభ్యర్థులు మరియు వారి మద్దతుదారులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా నిఘా ఉంచినట్లు, శాంతియుత వాతావరణంలో ప్రక్రియ ముగిసే వరకు ఈ భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయని పోలీసు అధికారులు వెల్లడించారు.

బ్రాహ్మణపల్లెలో వైసీపీకి భారీ షాక్ టీడీపీలోకి ముఖ్య నేతల చేరిక



ఓర్వకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : ఓర్వకల్లు మండలం బ్రాహ్మణ పల్లె గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ఆ గ్రామానికి చెందిన పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కీలక కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. మాధవి నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా జరిగింది. పాణ్యం శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డిల సమక్షంలో నేతలు పార్టీ మారారు. వైసీపీకి స్వస్తి పలికి టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారిలో ముఖ్య నాయకులు రాజగోపాల్ రెడ్డి, దేవరాజు, కురువ వెంకటేశ్వర్లు, రవి, చందు, భూషణ్, అవుకు సుబ్బారాయుడు, రవీంద్రలతో పాటు పలు ముఖ్యమైన కుటుంబాల సభ్యులు ఉన్నారు. వీరందరికీ గౌరు చరిత రెడ్డి, గౌరు వెంకట రెడ్డి దంపతులు తెలుగుదేశం పార్టీ పసుపు కండువాలు కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ చేరికల కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ రాజశేఖర్ చౌదరి, మాజీ డైరెక్టర్ రామ పుల్లారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేదునూరు వద్ద బోలెరో వాహనం బోల్తా 35 మందికి గాయాలు



అమలాపురం (తెలుగు కలం) అక్టోబర్ 22 : ప్రతినిధి : అయినవిల్లి మండలం నేదునూరు సమీపంలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాద బాధితులను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. ప్రమాదం గురించి సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన ఆయన, అమలాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అయినవిల్లి నుండి అంబాజీపేట మండలం మాచవరం వైపు వెళ్తున్న పెళ్లి బృందం ప్రయాణిస్తున్న బొలెరో వాహనం, నేదునూరు వద్ద కురిసిన వర్షం కారణంగా రహదారి పక్కనున్న మట్టిలో దిగబడి తీవ్రంగా బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో వాహనంలో సుమారు 50 మంది ప్రయాణిస్తుండగా, వారిలో 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే ఆనందరావు బాధితులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు అత్యవసర, మెరుగైన వైద్య సేవలు తక్షణమే అందించాలని ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. అలాగే, అమలాపురంలోని 'శ్రీనిధి హాస్పిటల్'లో అత్యవసర చికిత్స పొందుతున్న ముగ్గురి పరిస్థితిపై ఎమ్మెల్యే ఆనందరావు శ్రీనిధి హాస్పిటల్ వైద్యులకు స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. వారికి ఎటువంటి లోటు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని ప్రత్యేకంగా సూచించారు. బాధితులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో, వైద్యుల సలహా మేరకు వారిని మెరుగైన చికిత్స కోసం కాకినాడకు తరలించారు.

చిప్పగిరిలో తీవ్ర ఉద్రిక్తత ఎంపీటీసీ నామినేషన్ల వేళ టీడీపీ వైసీపీ శ్రేణుల మధ్య రణరంగం, పోలీసుల లాఠీచార్జ్



కర్నూలు (తెలుగు కలం) అక్టోబర్ 22 :ప్రతినిధి : కర్నూలు జిల్లా చిప్పగిరి మండల కేంద్రంలో ఎంపీటీసీ నామినేషన్ ప్రక్రియ సందర్భంగా తీవ్ర రాజకీయాందోళన, ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. చిప్పగిరి వీఓజ స్థానానికి నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వైసీపీ అభ్యర్థి మహానందితో పాటు ఆయనతో వచ్చిన పార్టీ క్యాడర్, నాయకులను టీడీపీ శ్రేణులు అడ్డుకోవడంతో ఈ ఘర్షణ ప్రారంభమైంది. వైసీపీ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు సిద్ధపడుతుండగా, స్థానిక పోలీస్ స్టేషన్ ముందే అతడి నామినేషన్ పత్రాలను చింపివేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య పరస్పర తోపులాట, తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిపరి స్థితుల్లో ఇరువర్గాల కార్యకర్తలు ఆవరణలో ఏర్పాటు చేసిన బారీ కేడ్లకు కట్టిన కర్రలను పీకి ఒకరిపై ఒకరు దాడులకు తెగబడేందుకు ప్రయత్నించడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉండటంతో వెంటనే రంగంలోకి దిగిన సీఐ రవిశంకర్ రెడ్డి ఇరువర్గాలను చెదరగొట్టేందుకు లాఠీచార్జ్ చేశారు. పోలీసులు లాఠీలకు పనిచెప్పి ఇరువర్గాల నాయకులను, కార్యకర్తలను అడ్డుకొని అక్కడి నుంచి తరిమ్మేశారు. లాఠీచార్జ్ జరుగుతున్న సమయానికి ఎట్టకేలకు వైసీపీ నాయకులు, అభ్యర్థి మహానంది సురక్షితంగా నామినేషన్ కేంద్రంలోకి పరుగెత్తి వెళ్లి నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ కేంద్రం వద్ద పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా మారడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు భారీగా మోహరించారు.

శారీరక, మానసిక ఆరోగ్యం కోసం రోజూ 30 నిముషాలు ఓం పఠించి చూడండి..



హిందూ ధర్మంలో ఓం శబ్దానికి ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. "ఓం" అనేది ఆది శబ్దంగా పరిగణించబడుతుంది. ధ్యానం లేదా యోగా సెషన్లలో ఓం ను పఠించడం వల్ల శారీరక, ఆధ్యాత్మిక శక్తిని పెంచుతుంది. అంతేకాదు ఏకాగ్రతను పెంపొందించడంతో పాటు దైవంతో సంబంధాన్ని సులభతరం చేయడంలో సహాయపడుతుంది. అయితే రోజూ 30 సార్లు ఓం అని పఠిస్తే కలిగే అద్భుతమైన లాభాలు అనేకం. ఓం శబ్దానికి హిందూ ధర్మంలో విశిష్ట స్థానం ఉంది. ఓం చిహ్నం త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణువు, శివుడితో ముడిపడి ఉంటుంది. "ఓం" ప్రతి భాగం త్రిమూర్తులోని విభిన్న కోణానికి అనుగుణంగా ఉంటుంది.

విధ్వంసకారుడు, పరివర్తనకర్త అయిన శివుడిని సూచిస్తుంది.

అటువంటి ఓంకార శబ్దంతో అధ్యత్మికంగానే కాదు శారీరకంగా కూడా అనేక ప్రయోజనాలు ఇస్తుందని ఓ బాలిక నిరూపించింది. ఓం శారీరక మానసిక అలసట దూరమవుతుందని పద్నాలుగేళ్ల బాలిక పశ్చిమ్ బెంగాల్ ప్రభుత్వం నిర్వహించిన సైన్ ప్రదర్శనలో ప్రయోగాత్మకంగా నిరూపించింది. ఆ బాలిక నిరూపించిన విధానం శాస్త్రవేత్తలను కూడా ఆకట్టుకుంది. కోల్‌కతాలోని అదమ్స్ వరల్డ్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న అన్వేష రాయ్ అనే బాలిక ఓం శబ్దం వినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయని ప్రయోగాత్మకంగా నిరూపించింది. ఇందు కోసం ఆ బాలిక 17 మంది యువతీ, యువకులను ఎంచుకుని వారికి ప్రశాంత వాతావరణంలో ఓంకారాన్ని 30 నిమిషాల పాటు వినిపించింది. తర్వాత వారి శరీరంలోని ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ శాతాన్ని లెక్కించింది. ఓం శబ్దంతో విన్న తర్వాత ఆ యువతీ యువకుల శరీరంలో ఆక్సిజన్ పరిమాణం పెరిగి, కార్బన్ డయాక్సడ్ శాతం తగ్గడం గమనించింది. అంతేకాదు రక్తంలో ఆక్సిజన్ శాతం పెరిగి, కార్బన్‌డైయాక్సైడ్, లాక్టిక్ యాసిడ్ నిల్వలు తగ్గి.. అలసట దూరం అవుతుందని నిరూపించింది. అసలు ఓం శబ్దంకి ఉన్న శక్తిని గురించి ఆలోచన తెలుసుకోవాలనే ఆసక్తిని అన్వేష ఉత్తరాఖండ్‌లో చార్ ధామ్ యాత్ర సమయంలో వచ్చినట్లు తెలుస్తోంది. అన్వేష బగేశ్వర్ నుంచి 68 కి.మీ. దూరంలో ఉన్న కేదారీనాథ్‌కు కొంతమంది పూజారులు రోజూ కాలినడకన రోజూ నీటిని తీసుకెళ్తున్నారు. ఈ సమయంలో పూజరుల్లో ఎటువంటి ఆయాసం, అలసట కనిపించడం లేదని గుర్తించింది. ఎలా ఇలా అంటూ ఆశ్చర్యంగా ఆ పూజారులను అబ్జర్వ్ చేసింది. అప్పుడు పూజారులు నీటిని తీసుకుని వెళ్తూ.. ఓం కారాన్ని జపిస్తూ వెళ్తున్న విషయాన్ని గుర్తించింది. ఓం శబ్దమే వారికి శారీరక మానసిక శక్తిని ఇస్తుందని భావించి ఓంకారంపై ప్రయోగాన్ని చేయాలని భావించింది. ఓం శబ్దం ద్వారా శరీరంలో 430 హెర్ట్జ్‌ల పౌనఃపున్యాలను వెలువడుతున్నట్లు గుర్తించింది. ఈ విషయాన్నీ నిర్ధారించుకోవడానికి వివిధ ల్యాబొరేటరీల్లో ఐదు ప్రయోగాలను నిర్వహించింది.

30 నిమిషాలు ఓం జపిస్తే ఏమవుతుంది?

"ఓం" అని 30 నిమిషాలు ఎక్కువసేపు జపించడం వల్ల మనస్సు, శరీరం, ఆత్మపై తీవ్ర ప్రభావాలు ఉంటాయి. ఈ శబ్దం లయబద్ధంగా పునరావృతం చేయడం ధ్యాన స్థితిని ప్రేరేపిస్తుంది. విశ్రాంతిని ప్రోత్సహిస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. "ఓం" కంపనాలు స్వర తంతువుల ద్వారా, శరీరంలో ప్రతిధ్వనిస్తాయి కనుక ఓం కార నాదం నాడీ వ్యవస్థను సానుకూలంగా ప్రభావితం చేస్తుందని, మనస్సును ప్రశాంతపరుస్తుందని, మానసిక స్పష్టతను పెంచుతుందని నమ్మకం. ధ్యానం మనిషిని ట్రాన్స్‌లోకి వెళ్ళేలా చేస్తుంది. దీంతో అంతర్గత శాంతి, ఆధ్యాత్మిక సంబంధాన్ని సులభతరం చేస్తుంది ఓంకారం నుంచి వెలువడే ప్రత్యేక పౌనఃపున్యం కలిగి శబ్దాలు శరీరంలోని న్యూరోట్రాన్స్‌మిటర్స్‌తోపాటు హార్మోన్ల (సెరోటినిన్, డోపమైన్) స్థాయిని పెంచుతాయి. ఈ ప్రక్రియకు రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు పెరగడమే కారణమని అన్వేష రాయ్ తెలియజేసింది.

మరిన్ని ఆధ్యాత్మిక వార్తల కోసం ఇక్కడ క్లిక్ చేయండి..

నోట్ : ఈ వార్తలలో ఇవ్వబడిన సమాచారం మత విశ్వాసాలపై ఆధారపడి ఉంది. పాఠకుల ఆసక్తి మేరకు.. పలువురు పండితుల సూచనలు, వారి తెలిపిన అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే.. వీటిలో ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పాఠకులు గమనించాలి. టీవీ9 తెలుగు దీనిని ధృవీకరించలేదు

ఫ్రిడ్జ్ లో వీటిని ఎలా పెడుతున్నారు ఏ ఏ రాక్ లలో ఏవి పెడుతున్నారు



ఫ్రిడ్జ్ లో అన్నీ పదార్థాలు ఉంచటం ఆరోగ్యానికి మంచిది కాదన్న విషయం మనలో చాలా మందికి తెలియదు. కొన్ని వస్తువులు తక్కువ ఉష్ణోగ్రతలలో నిల్వ చేయకపోతే త్వరగా పాడవుతాయి, ఇంకొన్ని మాత్రం చల్లదనంతో నష్టం వాటిల్లుతుంది. అందుకే సరైన రీతిలో నిల్వ చేసే పద్ధతులు తెలుసుకోవడం అవసరం. బంగాళదుంపలు, ఉల్లిపాయలు వంటి వాటిని చల్లని ప్రదేశంలో ఉంచడం వల్ల తేమ చేరి మొలకలు రావడం జరుగుతుంది. ఇవి గదిలో, గాలి చల్లగా ఉండే చోట ఉంచడం మంచిది. అలాగే క్యారెట్, ముల్లంగి, కాలీఫ్లవర్ వంటి కూరగాయలు మాత్రం తక్కువ ఉష్ణోగ్రతల్లో నిల్వ చేస్తే ఎక్కువ కాలం తాజాగానే ఉంటాయి. ఆకుకూరలు నేరుగా ఫ్రిడ్జ్ లో ఉంచడం వల్ల తేమ చేరి పాడైపోతాయి. వాటిని మొదటగా శుభ్రంగా కడిగి నీరు పూర్తిగా తొలగించిన తర్వాతే ఫ్రిడ్జ్ లో పెట్టాలి. అలాగే కూరగాయలను ప్లాస్టిక్ కవర్ లేదా గట్టి సంచుల్లో ఉంచడం వల్ల గాలి వెళ్లదీయక పాడైపోతాయి. కాబట్టి కాగితపు సంచులు లేకపోతే పలుచటి కాటన్ బట్టలో చుట్టి పెడితే తాజాగా ఉంటాయి. తేమ ఉండే పదార్థాలు ఫ్రిడ్జ్‌లో ఉంచినప్పుడు త్వరగా పాడయ్యే ప్రమాదం ఉంటుంది. కాలీఫ్లవర్, నారింజ, జామలు, క్యారెట్ వంటి పదార్థాలను వాడే ముందు కడగడం మంచిది కానీ నిల్వ చేసే సమయంలో తడిగా ఉంచకూడదు. శుభ్రంగా తుడిచిన తర్వాత ఫ్రిడ్జ్ లో ఉంచితే ఎక్కువ రోజులు నిలుస్తాయి. ఫ్రిడ్జ్ లో ప్రతి రాక్ ను అవసరానికి అనుగుణంగా వాడాలి. ఎగువ భాగంలో ఉడకబెట్టిన పదార్థాలు, మధ్య భాగంలో పాలు, పెరుగు వంటి పదార్థాలు ఉంచితే మంచిది. తలుపులో సాస్ బాటిళ్లు, తాగునీరు వంటి వస్తువులకు స్థానం ఇవ్వాలి. ఏదైనా తినే పదార్థాన్ని ఫ్రిడ్జ్ లో పెట్టేటప్పుడు మూత పెట్టకుండా పెడితే దాని వాసన మారిపోతుంది. అంతేకాదు ఆ వాసన వేరే ఆహార పదార్థాలకు కూడా అంటుకొని అవి కూడా పాడైపోయే ఛాన్స్ ఉంది. అందుకే ఫ్రిడ్జ్ లో ఏది పెట్టినా మూత పెట్టి ఉంచాలి. ఆహారాన్ని క్లాత్, పేపర్ లో చుట్టి నిల్వ చేయడం మంచిదే.. కానీ గట్టిగా చుట్టడం వల్ల గాలి వెళ్లదు. దాంతో వేడి నిలిచిపోతుంది. ఇలా ఉంచిన పదార్థం త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. ఈ సూచనలను పాటిస్తే ఫ్రిడ్జ్ వినియోగం వల్ల కలిగే నష్టం నివారించవచ్చు. పదార్థాలు తాజాగా ఉండేలా చూసుకోవచ్చు.

పీనట్ బటర్ లేదా బాదం బటర్ వీటిలో ఏది ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుంది



ఫిట్‌నెస్ కోసం తినే ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. ఇందులో వేరుశెనగ వెన్న , బాదం వెన్నకు చాలా ప్రాముఖ్యత ఇస్తారు. రెండిటిలో పోషకాలు సమృద్ధిగా, కేలరీలు తక్కువగా ఉంటాయి. అయితే ఈ రెండిటిలో ఏది ఆరోగ్యానికి ప్రయోజనం అనేది తెలుసుకుని ఎంచుకోవడం సరైనది. వేరుశెనగ వెన్న ఎక్కువ ప్రయోజనకరమా లేదా బాదం వెన్న అనేది ఈ రోజు తెలుసుకుందాం. పస్తుతం అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా చాలా మంది ఊబకాయం సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అటువంటి పరిస్థితిలో ప్రజలు ఫిట్‌నెస్ కోసం వ్యాయామంతో పాటు తినే ఆహారంపై పూర్తి శ్రద్ధ వహిస్తారు. తినే ఆహారంలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు వంటి ముఖ్యమైన పోషకాలు ఉండేలా చూసుకుంటారు. ఈ సందర్భంలో వేరుశెనగ వెన్న , బాదం వెన్న చాలా ఇష్టపడతాయి. ఈ రెండు వెన్నలు వ్యాయామం చేసే వ్యక్తుల ఆహారంలో ముఖ్యమైన భాగం. పీనట్ బటర్ లేదా బాదం బటర్ లో ఏది ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుంది. ఏది ఎంచుకోవడం మంచిది అనే ప్రశ్న తలెత్తుతుంది. రెండు వెన్నలలో పోషకాలు పుష్కలంగా ఉన్నప్పటికీ రెండింటి పోషకాలు భిన్నంగా ఉంటాయి. వేరుశెనగ వెన్నలో ఎక్కువ మొత్తంలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్నాయి. అయితే బాదం వెన్నలో ఎక్కువ విటమిన్ %జు% ఉంటుంది. కనుక మీరు పీనట్ బటర్ లేదా బాదం బటర్ లో ఏది ఎంచుకోవాలా అని గందరగోళంగా ఉంటే. ఈ రోజు వేరుశెనగ , బాదం వెన్నలలో ఏది ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందో తెలుసుకుందాం..

పీనట్ బటర్, బాదం బటర్ న్యూట్రిషన్

వేరుశెనగ వెన్న, బాదం వెన్న రెండిటిలోనూ పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. వేరుశెనగ వెన్నలో ప్రోటీన్‌తో పాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్ మెగ్నీషియం, ఫోలేట్, భాస్వరం ఉంటాయి. బాదం వెన్నలో విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు (మంచి కొవ్వులు), ఫైబర్, కాల్షియం, ఐరన్, పొటాషియం కూడా సమృద్ధిగా ఉంటుంది.

ఇంట్లో ఫ్రిడ్జ్ ని ఈ దిశలో పెట్టారా.. కష్టాలకు వెల్కం చెప్పినట్లే

దేనిలో ఎక్కువ ప్రోటీన్ ఉంటుందంటే

ఫిట్‌నెస్ ప్రియులకు ప్రోటీన్ చాలా ముఖ్యమైన పోషకాహారం. అలాంటి సందర్భంలో పీనట్ బటర్ లేదా బాదం బటర్ ను ఎంచుకుంటారు. అయితే ఈ రెండింటిలోని ప్రోటీన్ కంటెంట్ తెలుసుకోవాలనుకుంటే.. ఒక చెంచా వేరుశెనగ వెన్నలో 4 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. అయితే 1 చెంచా బాదం వెన్నలో 3 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. అలాంటి సందర్భంలో కండరాలను నిర్మించేవారికి వేరుశెనగ వెన్న ప్రోటీన్ మంచి మూలం.

పీనట్ బటర్, బాదం బటర్ లో ఆరోగ్య ప్రయోజనాలు

వేరుశెనగ వెన్న ప్రోటీన్ మంచి మూలం. అటువంటి పరిస్థితిలో ఇది శాఖాహారులకు ముఖ్యంగా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి (మోనోశాచురేటెడ్ కొవ్వు) మంచిది. ఇది చౌకైన , సులభంగా లభించే వెన్న కూడా. మరోవైపు బాదం వెన్న విటమిన్ %జు% మంచి మూలం. ఇది చర్మానికి, యాంటీఆక్సిడెంట్ ప్రయోజనాలకు మంచిది. ఇందులో ఫైబర్ , మెగ్నీషియం కూడా ఉంటాయి. ఇది జీర్ణక్రియ , రక్తంలో చక్కెర నియంత్రణలో సహాయపడుతుంది.

రెండిటిలో ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందంటే

మీరు చౌకైన, ప్రోటీన్ అధికంగా ఉండే వెన్నని తీసుకోవాలనుకుంటే వేరుశెనగ వెన్న మంచి ఎంపిక. ఇది శక్తినిచ్చే , గుండెకు ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులతో నిండి ఉంటుంది. మరోవైపు ఫైబర్, విటమిన్ మెగ్నీషియం వంటి పోషకాలకు ప్రాధాన్యత ఇచ్చినా లేదా వేరుశెనగ తింటే అలెర్జీ ఉన్నవారు బాదం వెన్నని ఎంచుకోవడం మంచిది. ఇది చర్మం, జీర్ణక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణకు మరింత ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. మొత్తంమీద బడ్జెట్ పరిమితంగా ఉండి.. ప్రోటీన్ కావాలి అనుకుంటే వేరుశెనగ వెన్నను ఎంచుకోండి. అయితే శరీరానికి అధిక మొత్తంలో పోషకాలు కావాలనుకుంటే బాదం వెన్న మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

మరిన్ని లైఫ్ స్టైల్ న్యూస్ కోసం క్లిక్ చేయండి..

ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నానేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)

వేసవి వేడికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారా..? ఈ జ్యూస్ తాగితే అంతా సెట్ అయిపోతుంది..!



వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలతో శరీరం నీరసం చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో శరీరాన్ని చల్లగా ఉంచే ప్రకృతిసిద్ధమైన డ్రింక్ లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో బత్తాయి జ్యూస్ అత్యుత్తమమైనదిగా చెప్పవచ్చు. ఈ పండులో విటమిన్ సి, విటమిన్ ఎ, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్, ఫైబర్ తోపాటు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇవన్నీ శరీరానికి అవసరమైన మూలకాలు. ప్రతి రోజు బత్తాయి రసం తాగడం వల్ల ఈ పోషకాలు నిత్యం అందుతాయి వేడి వల్ల శరీరం బలహీనంగా మారినప్పుడు గ్లాసంత బత్తాయి రసం తాగితే తక్షణం శక్తిని తిరిగి పొందే అవకాశం ఉంది. ఇది శరీరాన్ని ఉల్లాసంగా ఉంచుతుంది. వేడి వల్ల ఏర్పడే నీరసం, తలనొప్పి వంటి లక్షణాల నుంచి ఉపశమనం ఇస్తుంది. ఈ జ్యూస్ తాగడం వల్ల లోపలుండే వేడి తగ్గిపోతుంది. వేసవిలో అధికంగా కనిపించే హీట్ స్ట్రోక్ నుంచి రక్షణ లభిస్తుంది. శరీర ఉష్ణోగ్రతను స్థిరంగా ఉంచే సహజ మార్గాల్లో ఇది ఒకటి. విటమిన్ సి శరీరంలో రోగాలకు ప్రతిఘటించే శక్తిని పెంపొందిస్తుంది. ఈ పండు ద్వారా తీసుకునే జ్యూస్ ఈ శక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ కొద్దిపాటి బత్తాయి రసం తాగటం వల్ల మానసిక శక్తి కూడా ఉత్సాహంగా ఉంటుంది. ఈ డ్రింక్ తాగడం వల్ల చర్మంపై సహజమైన కాంతి కనిపిస్తుంది. వేసవిలో చర్మం పొడిబారే అవకాశం ఎక్కువగా ఉంటే.. బత్తాయి జ్యూస్ తాగడం ద్వారా చర్మం మృదువుగా, ఆరోగ్యంగా మారుతుంది. బత్తాయి రసం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలను తగ్గించే గుణాలు ఇందులో ఉన్నాయి. వేసవిలో తక్కువ ఆహారం తీసుకునే సమయంలో జీర్ణక్రియ సహజంగా జరిగేందుకు ఇది ఎంతో మేలు చేస్తుంది వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచడం, శక్తిని నిలుపుకోవడం, చర్మ ఆరోగ్యం పరిరక్షించుకోవడం కోసం బత్తాయి జ్యూస్ నిత్యం తీసుకోవడం చాలా ఉపయోగకరం. సహజంగా లభించే ఈ రసం తాగడం వల్ల ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుంది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నానేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)

రోజుని ఆరోగ్యకరమైన ఈ ఐదు టిఫిన్స్ తో మొదలు పెట్టండి.. పుష్కలమైన శక్తి మీ సొంత

ఆరోగ్యంగా ఉండాలంటే అల్పాహారం స్కిప్ చేయవద్దు అని నిపుణులు చెబుతారు. మన దేశంలో అల్పాహారం విషయంలో కూడా భిన్న రుచులున్నాయి. కొంతమంది ఉదయం టీతో పాటు బ్రెడ్, రస్క్, నమ్కీన్ మొదలైన వాటిని తినడానికి ఇష్టపడతారు. మరికొందరు అల్పాహారంలో బంగాళాదుంప పరాఠా, పూరీ మొదలైన వాటిని కూడా తీసుకుంటారు. అయితే మరికొందరు ఇడ్లి, ఉప్మా వంటి వాటిని తింటారు. ఈ రోజు రోజుని మొదలు పెట్టే ఆరోగ్యకరమైన అల్పాహారాల గురించి తెలుసుకుందాం, ఇవి ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. పుష్కలంగా శక్తిని ఇస్తాయి. భారతదేశంలో చాలా మంది ఉదయం టీతో రోజుని ప్రారంభిస్తారు. అల్పాహారం పేరుతో టీతో పాటు కుకీలు, బిస్కెట్లు, నమ్కీన్ మొదలైన వాటిని తీసుకుంటారు. ఇవి శరీరానికి దాదాపు ఎటువంటి పోషకాలను అందించవు. పైగా ఆరోగ్యానికి హానికరం. ఉప్పు కలిపిన స్నాక్స్, టీతో బిస్కెట్లు వంటివి తినడం అసిడిటీకి కారణమవుతాయి. ఆరోగ్యకరమైన అల్పాహారం తీసుకోవడం కూడా ముఖ్యం. ఎందుకంటే రాత్రంతా ఏమీ తినకపోవడంతో కడుపు ఖాళీగా ఉంటుంది. కనుక ఉదయం తీసుకునే అల్పాహారం మధ్యాహ్నం భోజనం చేసే వరకు శక్తిని ఇస్తుంది. కనుక టిఫిన్ గా ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకోవడం ముఖ్యం. ఎవరైనా సరైన అల్పాహారం తీసుకోక పోయినా లేదా అల్పాహారంలో ఆరోగ్యకరమైనవి తినకపోయినా త్వరగా అలసిపోవడమే కాదు త్వరగా స్నాక్స్ ని తినాలని కోరుకుంటారు. ఇలా అనారోగ్యకరమైన స్నాక్స్ తినడం వల్ల బరువు పెరుగుతారు.ఆరోగ్యంగా ఉండటానికి మీరు మీ ఆహారంలో వివిధ రకాల ధాన్యాలతో చేసిన ఆహారాన్ని చేర్చుకోవాలి, ఎందుకంటే ఇవి శరీరంలోని పోషకాల లోపాన్ని తీరుస్తాయి. వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారు. ఈ రోజు ఆరోగ్యకరమైన అల్పాహారాల గురించి ఈ రోజు తెలుసుకుంటాము. ఇవి చాలా ఆరోగ్యకరమైనవి కూడా. ఆరోగ్యంగా ఉండటానికి మీరు మీ ఆహారంలో వివిధ రకాల ధాన్యాలతో చేసిన ఆహారాన్ని చేర్చుకోవాలి, ఎందుకంటే ఇవి శరీరంలోని పోషకాల లోపాన్ని తీరుస్తాయి. వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారు. ఈ రోజు ఆరోగ్యకరమైన అల్పాహారాల గురించి ఈ రోజు తెలుసుకుంటాము. ఇవి చాలా ఆరోగ్యకరమైనవి కూడా.తెప్లా: గుజరాతీ ప్రజల అల్పాహారం. తెప్లా, రుచికరమైనది మాత్రమే కాదు. పోషకాలతో కూడా నిండి ఉంటుంది. ఎందుకంటే చాలా మంది దీనిని మల్టీగ్రెయిన్, సాధారణంగా చిక్‌పా , మిల్లెట్ పిండి, గోధుమ పిండితో తయారు చేస్తారు. శీతాకాలంలో కసూరి మెంతిని తెప్లాలో కూడా ఉపయోగిస్తారు. ఇది మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. తెప్లాను వేయించడానికి, శుద్ధి చేసిన నూనెకు బదులుగా దేశీ నెయ్యి లేదా ఇంట్లో తయారుచేసిన వెన్నను ఉపయోగించవచ్చు. తెప్లా: గుజరాతీ ప్రజల అల్పాహారం. తెప్లా, రుచికరమైనది మాత్రమే కాదు. పోషకాలతో కూడా నిండి ఉంటుంది. ఎందుకంటే చాలా మంది దీనిని మల్టీగ్రెయిన్, సాధారణంగా చిక్‌పా , మిల్లెట్ పిండి, గోధుమ పిండితో తయారు చేస్తారు. శీతాకాలంలో కసూరి మెంతిని తెప్లాలో కూడా ఉపయోగిస్తారు. ఇది మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. తెప్లాను వేయించడానికి, శుద్ధి చేసిన నూనెకు బదులుగా దేశీ నెయ్యి లేదా ఇంట్లో తయారుచేసిన వెన్నను ఉపయోగించవచ్చు.మల్టీగ్రెయిన్ పిండి: పెసర పప్పు, శనగపిండి, సుజీ, మొక్కజొన్న పిండి కలిపి మల్టీగ్రెయిన్ చీలా తయారు చేసుకుని అల్పాహారంగా తినవచ్చు. రోజువారీ ఇబ్బందులను నివారించడానికి అన్ని పదార్థాలను కలిపి రుబ్బుకుని సిద్ధంగా ఉంచుకోవచ్చు. ఈ చీలాకు వివిధ రకాల కూరగాయలను జోడించడం వల్ల ఇది మరింత ఆరోగ్యకరమైన అల్పాహారంగా మారుతుంది. మల్టీగ్రెయిన్ పిండి: పెసర పప్పు, శనగపిండి, సుజీ, మొక్కజొన్న పిండి కలిపి మల్టీగ్రెయిన్ చీలా తయారు చేసుకుని అల్పాహారంగా తినవచ్చు. రోజువారీ ఇబ్బందులను నివారించడానికి అన్ని పదార్థాలను కలిపి రుబ్బుకుని సిద్ధంగా ఉంచుకోవచ్చు. ఈ చీలాకు వివిధ రకాల కూరగాయలను జోడించడం వల్ల ఇది మరింత ఆరోగ్యకరమైన అల్పాహారంగా మారుతుంది.సుజీ ఉప్మా లేదా పాన్‌కేక్: ఉదయం గోధుమలతో చేసిన లేదా సుజీ ఉపయోగించి ఉప్మా లేదా పాన్‌కేక్ తయారు చేసుకోవచ్చు. ఈ రెండు ఆహారాలు కడుపుని ఎక్కువసేపు నిండుగా ఉంచుతాయి. పోషకాలతో కూడా సమృద్ధిగా ఉంటాయి. ఈ రెండు విషయాలలోనూ నూనెను పరిమిత పరిమాణంలో ఉపయోగిస్తారు. కనుక ఇది ఫిట్‌నెస్ దృక్కోణంలో కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. సుజీ ఉప్మా లేదా పాన్‌కేక్: ఉదయం గోధుమలతో చేసిన లేదా సుజీ ఉపయోగించి ఉప్మా లేదా పాన్‌కేక్ తయారు చేసుకోవచ్చు. ఈ రెండు ఆహారాలు కడుపుని ఎక్కువసేపు నిండుగా ఉంచుతాయి. పోషకాలతో కూడా సమృద్ధిగా ఉంటాయి. ఈ రెండు విషయాలలోనూ నూనెను పరిమిత పరిమాణంలో ఉపయోగిస్తారు. కనుక ఇది ఫిట్‌నెస్ దృక్కోణంలో కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.

ఓట్స్: అల్పాహారంలో ఓట్స్ తినడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఓట్స్ తో తయారు చేసే ఓట్ ఆహారంలో ఫైబర్, ప్రోటీన్స్, మాంగనీస్, ఫాస్పరస్, రాగి, ఇనుము, సెలీనియం, విటమిన్ బి1, జింక్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉన్నాయి. ఇవి మీకు శక్తిని ఇవ్వడంలో పాటు మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడంలో ప్రభావవంతంగా ఉంటాయి.

ఓట్స్: అల్పాహారంలో ఓట్స్ తినడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఓట్స్ తో తయారు చేసే ఓట్ ఆహారంలో ఫైబర్, ప్రోటీన్స్, మాంగనీస్, ఫాస్పరస్, రాగి, ఇనుము, సెలీనియం, విటమిన్ బి1, జింక్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉన్నాయి. ఇవి మీకు శక్తిని ఇవ్వడంలో పాటు మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచడంలో ప్రభావవంతంగా ఉంటాయి.

బార్లీ: ఆరోగ్యకరమైన అల్పాహారంగా బార్లీ వంటకాలు బెస్ట్ ఎంపిక. బార్లీ కిచిడి, బార్లీ ఉప్మా, బార్లీ గంజిని ఉదయమే అల్పాహారంగా తీసుకోవచ్చు. బార్లీ గంజిని సిద్ధం చేయడానికి ఎక్కువ సమయం పట్టదు. ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటుంది. బార్లీ శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉన్న ధాన్యం కనుక వేసవి కాలంలో బార్లీ గంజిని తీసుకోవాలి. మీరు పాలతో తీపి గంజి చేయవచ్చు లేదా ఉప్పు గంజిని పెసలుతో కలిపి తయారు చేసుకోవచ్చు. దీనికి వేరుశనగపప్పు జోడించడం వల్ల రుచితో పాటు పోషకాలు కూడా పెరుగుతాయి.

బార్లీ: ఆరోగ్యకరమైన అల్పాహారంగా బార్లీ వంటకాలు బెస్ట్ ఎంపిక. బార్లీ కిచిడి, బార్లీ ఉప్మా, బార్లీ గంజిని ఉదయమే అల్పాహారంగా తీసుకోవచ్చు. బార్లీ గంజిని సిద్ధం చేయడానికి ఎక్కువ సమయం పట్టదు. ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటుంది. బార్లీ శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉన్న ధాన్యం కనుక వేసవి కాలంలో బార్లీ గంజిని తీసుకోవాలి. మీరు పాలతో తీపి గంజి చేయవచ్చు లేదా ఉప్పు గంజిని పెసలుతో కలిపి తయారు చేసుకోవచ్చు. దీనికి వేరుశనగపప్పు జోడించడం వల్ల రుచితో పాటు పోషకాలు కూడా పెరుగుతాయి.



ఇవి తింటే కొలెస్ట్రాల్ కంట్రోల్ లో ఉంటుంది.. గుండెకు మంచిదంటున్నారు నిపుణులు..!



ప్రస్తుత కాలంలో చెడు కొలెస్ట్రాల్ సమస్య చాలా మందిని వేధిస్తోంది. ఇది గుండె ఆరోగ్యానికి ముప్పుగా మారుతోంది. ప్రాసెస్డ్ ఫుడ్ కు బదులుగా డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. రోజూ కొన్ని గింజలను మితంగా తింటే శరీరానికి శక్తి లభించడంతో పాటు గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఇప్పటి జీవనశైలి కారణంగా కొలెస్ట్రాల్ స్థాయిలు బాగా పెరిగిపోతున్నాయి. పనిలో ఒత్తిడి, శారీరక శ్రమ తగ్గిపోవడం, వేళకు తినకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వంటి కారణాలు చెడు కొలెస్ట్రాల్ పెరగడానికి దారితీస్తున్నాయి. ఇది గుండె ఆరోగ్యానికి ముప్పుగా మారవచ్చు. ఈ సమస్యను ఎదుర్కోవడం కోసం సరైన ఆహారం తీసుకోవడం అవసరం. బాదంలో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. రోజూ కొన్ని బాదం గింజలు నానబెట్టి తింటే.. శరీరానికి శక్తి అందడమే కాకుండా కొలెస్ట్రాల్ స్థాయిలు సమతుల్యంగా ఉంటాయి. బాదం వల్ల గుండె పనితీరు మెరుగవుతుంది. సహజమైన తీపి కలిగిన ఖర్జూరాల్లో పాలీఫినాల్స్ ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడతాయి. రోజూ 2 లేదా 3 ఖర్జూరాలు తినడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. పిస్తా గింజల్లో పోషకాలు అధికంగా లభిస్తాయి. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తొలగించడంలో సహకరిస్తాయి. ఉదయాన్నే 5 నుంచి 6 పిస్తా తినటం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా లభించే వాల్ నట్స్ గుండెకు ఎంతో మేలు చేస్తాయి. ఇవి మంచి కొవ్వులను పెంచుతూ.. చెడు కొలె

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 23 - 10 - 2026

మెటాకు అమెరికా కోర్టు బిగ్ షాక్- 2.3 లక్షల కోట్ల భారీ జరిమానా

వినియోగదారుల గోప్యత విషయంలో వారిని మోసగించినందుకు ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాకు అమెరికాలోని న్యూమెక్సికో కోర్టు పెద్ద షాక్ ఇచ్చింది



టెక్ దిగ్గజం మెటాకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. న్యూ మెక్సికోలోని ఒక కోర్టు, ఈ సంస్థపై 25 బిలియన్ డాలర్ల అంటే సుమారు రూ.2.3 లక్షల కోట్లు జరిమానా విధించింది. వినియోగదారుల డేటా గోప్యతకు సంబంధించి వారిని తప్పుదోవ పట్టించినందుకు మెటా దోషిగా తేలిందని కోర్టు పేర్కొంటూ, ఈ జరిమానా మొత్తాన్ని న్యూ మెక్సికో రాష్ట్రానికి చెల్లించాలని ఆదేశించింది. అమెరికా చరిత్రలో ఒక సంస్థపై విధించిన అతిపెద్ద జరిమానాలలో ఇది ఒకటిగా నిలిచింది.2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో, 'కేంబ్రిడ్జ్ అనలిటికా' అనే బ్రిటీష్ కన్సల్టింగ్ సంస్థ, లక్షలాది మంది ఫేస్‌బుక్ వినియోగదారుల డేటాను సేకరించి, దానిని రాజకీయ ప్రచారాల కోసం దుర్వినియోగం చేసిందనేది ప్రధాన ఆరోపణ. వినియోగదారుల అనుమతి లేకుండానే ఈ డేటాను సేకరించడం అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. ఈ విషయం సదరు సంస్థలో పనిచేసిన మాజీ ఉద్యోగి ద్వారా వెలుగులోకి వచ్చింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలే కాకుండా, బ్రెగ్జిట్ (దీతీవఇఱ్) ప్రజాభిప్రాయ సేకరణలోనూ, అలాగే భారత్, కెన్యా, నైజీరియాలలో జరిగిన ఎన్నికలలోనూ ఈ సంస్థ జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.2021లో, న్యూ మెక్సికో అటార్నీ జనరల్ రావుల్ టోర్రెజ్, డేటా ఉల్లంఘనలకు సంబంధించి మెటాపై దావా వేశారు. వినియోగదారుల డేటా ఎవరికి అందుబాటులోకి వస్తుందనే విషయంలో మెటా నిజం చెప్పలేదని ఆయన ఆరోపించారు. ఈ కేసులో మెటాకు 219 బిలియన్ డాలర్ల వరకు జరిమానా పడే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అయితే, న్యాయమూర్తి ఆ మొత్తాన్ని 25 బిలియన్ డాలర్లకు తగ్గిస్తూ తీర్పు ఇచ్చారు. ఇదే 'కేంబ్రిడ్జ్ అనలిటికా' వ్యవహారంలో, గతంలో 2019లో అమెరికా ఫెడరల్ ట్రేడ్ కమిషన్ మెటాకు 5 బిలియన్ డాలర్ల జరిమానా విధించింది.తాజా జరిమానాపై మెటా స్పందించింది. ఈ అప్పీలులో తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది. ఈ తీర్పు వల్ల న్యూ మెక్సికో రాష్ట్రంలో వ్యాపారం నిర్వహించడం చాలా కష్టతరమవుతుందని కంపెనీ పేర్కొంది. సుమారు 2 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన మెటాకు, ఈ జరిమానా పెద్ద మొత్తమే అయినప్పటికీ, కంపెనీ మొత్తం విలువపై దీని ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అంతేకాకుండా, అప్పీలు ప్రక్రియ ద్వారా ఈ కేసు మరింత కాలం కొనసాగే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.కాగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తమ వినియోగదారులకు వార్తలు, వీడియోలు, ఇతర సమాచారాన్ని ఎలా అందిస్తున్నాయనే దానిపై భారత ప్రభుత్వం ఇటీవల దృష్టి సారించింది. ముఖ్యంగా, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల మాతృ సంస్థ అయిన మెటా ప్లాట్‌ఫారమ్స్‌ను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. సోషల్ మీడియా సిఫార్సు వ్యవస్థలు (కంటెంట్‌ను సూచించడానికి ఉపయోగించే యంత్రాంగాలు) వినియోగదారులకు కేవలం ఒక రకమైన కంటెంట్‌ను లేదా పరిమిత శ్రేణి కథనాలను మాత్రమే అసమానంగా ప్రదర్శించకూడదని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అటువంటి కంటెంట్‌కు అనవసరమైన ప్రాధాన్యత ఇవ్వకుండా చూసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ కంపెనీని ఆదేశించింది.అంతేకాకుండా, శాంతిభద్రతలకు భంగం కలిగించే, హింసను ప్రేరేపించే, లేదా ప్రజలలో గందరగోళం లేదా అశాంతికి కారణమయ్యే చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దారితీసే కంటెంట్‌పై పర్యవేక్షణను పెంచాలని మంత్రిత్వ శాఖ కోరింది. ఈ మేరకు అక్టోబర్ 10న మెటాకు ఒక అధికారిక సలహా జారీ చేసింది. అలాగే ఫోటోలు, వీడియోలు లేదా గ్రాఫిక్స్ వంటి సమాచారాన్ని సమర్పించేటప్పుడు, వాటి వెనుక ఉన్న సందర్భాన్ని కూడా వివరించాలని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఒక వీడియో లేదా ఫోటో ఎప్పుడు, ఎక్కడ తీశారో లేదా దానికి సంబంధించిన పరిస్థితులు ఏమిటో వినియోగదారులకు స్పష్టంగా తెలియని సందర్భాల్లో, పూర్తి వివరాలను అందించాలని ప్రత్యేకంగా సూచించింది.

వరుసగా రెండో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

2 శాతానికి పైగా పడిపోయిన స్మాల్‌క్యాప్ షేర్లు

143.21 పాయింట్లు తగ్గి 73,709.69 వద్ద ముగిసిన సెన్సెక్స్

77.60 పాయింట్లు పతనమై 22,811.35కు చేరిన నిఫ్టీ

నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.37 శాతం క్షీణత

మిడ్‌క్యాప్ సూచీ 1.58 శాతం నష్టం

ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, ఐటీ రంగం మెరుగైన పనితీరు



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిశాయి. ఆటో, మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి, కొన్ని భారీ కంపెనీల షేర్ల పతనం సూచీలను కిందకు లాగాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో నష్టాలు ఎక్కువగా నమోదయ్యాయి.బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 143.21 పాయింట్లు నష్టపోయి 73,709.69 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 77.60 పాయింట్లు తగ్గి 22,811.35 వద్ద ముగిసింది. నిఫ్టీలో బజాజ్ ఫైనాన్స్, బీఎస్ఈ లిమిటెడ్, ఎటర్నల్ షేర్లు అత్యధికంగా నష్టపోయిన వాటిలో నిలిచాయి.విస్తృత మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.58 శాతం పడిపోగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.37 శాతం క్షీణించింది. రంగాలవారీగా చూస్తే కెమికల్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్ సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. ఐటీ రంగం మాత్రం ఇతర రంగాలతో పోలిస్తే మెరుగైన పనితీరు కనబరిచి లాభాల్లో నిలిచింది.మార్కెట్లలో స్వల్పకాలిక దిశపై విశ్లేషకులు అప్రమత్తత వ్యక్తం చేశారు. నిఫ్టీ 23,000 పాయింట్ల స్థాయిని నిలకడగా దాటితేనే స్వల్పకాలిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ స్థాయిని తిరిగి అందుకోలేకపోతే మరింత పతనం ఉండొచ్చని హెచ్చరించారు. దిగువన 22,650-22,600 పాయింట్ల పరిధిని తక్షణ మద్దతు స్థాయిగా, ఆ తర్వాత 22,300 పాయింట్లను కీలక స్థాయిగా గుర్తించారు. 22,600 కంటే దిగువకు పడిపోతే అమ్మకాల ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందన్నారు.కంపెనీల ఆర్థిక ఫలితాలు, వాణిజ్య చర్చల్లో పురోగతి, విదేశీ పెట్టుబడుల ప్రవాహం మార్కెట్ తదుపరి దిశను ప్రభావితం చేయనున్నాయని విశ్లేషకులు తెలిపారు. ముడి చమురు ధరలు, అంతర్జాతీయ బాండ్ల రాబడులు, కరెన్సీ విలువల్లో ఒడుదొడుకులు తగ్గడం కూడా మార్కెట్ స్థిరత్వానికి కీలకమని పేర్కొన్నారు.

బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో ముందడుగు

భారత్ బయోటెక్ అనుబంధ సంస్థతో వీజెన్ బయో భాగస్వామ్యం!

ప్రముఖ వ్యాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ సబ్సిడరీ న్యూసిలియన్ థెరప్యూటిక్స్, హైదరాబాద్‌కు చెందిన వీజెన్ బయోతో ఒక వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది

బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో ఇది కీలక పరిణామంగా మారనుంది



బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో కొత్త తరహా కణ చికిత్సను అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన రెండు సంస్థలు చేతులు కలిపాయి. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ వ్యాక్సిన్ తయారీ సంస్థ భారత్ బయోటెక్ సబ్సిడరీ న్యూసిలియన్ థెరప్యూటిక్స్- ప్రిసిషన్ ఆంకాలజీ రంగంలో పనిచేస్తున్న వీజెన్ బయోతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేసే లక్ష్యంతో రెండు సంస్థలు అక్టోబర్ 21న ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. మల్టిపుల్ మైలోమా అనే బ్లడ్ క్యాన్సర్ చికిత్స కోసం అభివృద్ధి చేస్తున్న ఎూ- 2511 అనే థెరపీని తయారు చేయడం, క్లినికల్ పరీక్షలు, భవిష్యత్తులో కమర్షియల్ ప్రొడక్షన్ దిశగా ముందుకు తీసుకెళ్లడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశంగా ఉంది.ఈ థెరపీ కింద భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా ఫేజ్ 1/2 క్లినికల్ ట్రయల్స్ నిర్వహించనున్నారు. ఇక్కడ ఫేజ్ 1/2 క్లినికల్ ట్రయల్స్ అంటే ఒకదాని తర్వాత ఒకటి కాకుండా మొదటి దశ, రెండో దశ ప్రయోగాల్ని ఒకేసారి నిర్వహించే అత్యాధునిక క్లినికల్ ట్రయల్ పద్ధతి అని చెప్పొచ్చు. ఈ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ద్వారా ఈ చికిత్సా విధానాన్ని విజయవంతంగా పూర్తి చేసి, 2028 నాటికి మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇందుకు అవసరమైన క్లినికల్ పరీక్షలు, నియంత్రణ సంస్థల అనుమతులు పూర్తి కావాల్సి ఉంటుంది.సాధారణంగా క్యాన్సర్ చికిత్సలో మందులు, కీమోథెరపీ, రేడియేషన్ వంటి పద్ధతులు ఉపయోగిస్తారు. కానీ కింద రోగి శరీరంలోని రోగనిరోధక కణాలనే, క్యాన్సర్ కణాలను గుర్తించి దాడి చేసేలా మార్చి ఉపయోగించే ప్రత్యేక చికిత్సా విధానం. ఈ ప్రాసెస్‌లో రోగి నుంచి ు- సెల్స్ సేకరించి, క్యాన్సర్ కణాల్ని గుర్తించేలా జన్యు మార్పులు చేస్తారు. అనంతరం ఆ కణాల్ని ప్రత్యేక పరిస్థితుల్లో రూపొందించి, తిరిగి రోగి శరీరంలో ప్రవేశపెడతారు. ఈ విధానం ద్వారా క్యాన్సర్ కణాల్ని లక్ష్యంగా చేసుకోవడం సాధ్యం అవుతుంది. వీజెన్ బయో అభివృద్ధి చేస్తున్న ఎూ- 2511 ఒక ఆటోలోగస్ డ్యూయెల్ టార్గెట్ థెరపీ. దీంట్లో ఆటోలోగస్ అనేది రోగి నుంచి సేకరించిన కణాల్ని ఉపయోగించడం. డ్యూయెల్ టార్గెట్ అంటే క్యాన్సర్ కణాలపై ఉండే రెండు ప్రత్యేక లక్ష్యాల్ని గుర్తించేలా ఈ చికిత్సను రూపొందించడం. ఇక్కడ క్యాన్సర్ కణాలలోని దీజహీూ, జణ19 ను లక్ష్యంగా చేసుకుంటుంది. దీని వల్ల క్యాన్సర్ కణాలు శరీర రోగనిరోధక వ్యవస్థ నుంచి తప్పించుకునే సామర్థ్యాన్ని కోల్పోతాయి.ఇప్పటికే చైనాలో క్లినికల్ అనుభవాన్ని సంపాదించగా, ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న క్లినికల్ ట్రయల్స్ ద్వారా ఎూ-2511 థెరపీ అత్యుత్తమ ఫలితాలు ఇస్తున్నట్లు ఈ సంస్థలు ప్రకటించాయి. ముఖ్యంగా శరీరంలోని ఇతర అవయవాలకు పాకే ఎక్స్‌ట్రామెడుల్లరీ క్యాన్సర్ ఉన్న రోగుల్లో ఆశాజనకమైన ఫలితాలు కనిపించినట్లు కంపెనీ తెలిపింది. ఇంకా ఇది రోగులకు సురక్షితమైనదని, ఈ థెరపీని తక్కువ ఖర్చుతో, భారీ స్థాయిలో తయారు చేసే వీలుండటం వల్ల భారతదేశంలో క్యాన్సర్ రోగులకు ఈ అత్యాధునిక చికిత్సను చాలా తక్కువ ధరకే, సులభంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నాయి."క్యాన్సర్ బాధితులకు కొత్త ఆశలు చిగురింపజేయడమే మా లక్ష్యం. న్యూసిలియన్ అంతర్జాతీయ స్థాయి తయారీ మౌలిక వసతులు, మా పరిశోధనా సామర్థ్యాలు జతకలవడం వల్ల భారతీయులకు తక్కువ ఖర్చులోనే అడ్వాన్స్‌డ్ జీన్ థెరపీలు అందనున్నాయి.సంస్థల ఒప్పందం ప్రకారం 2511 కు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయడం, తయారీ ప్రక్రియ, క్లినికల్ పరీక్షలకు అవసరమైన ఉత్పత్తిని తయారు చేయడం, భవిష్యత్తులో వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి చేయడం వంటి బాధ్యతల్ని న్యూసిలియన్ చేపడుతుంది. ఉత్పత్తి విధానాల్ని మెరుగుపర్చడం, తయారీలో వీలైనంతగా నష్టాల్ని తగ్గించడం, ఒకే నాణ్యతతో ఉత్పత్తుల్ని తయారు చేయడం ద్వారా ఖర్చుల్ని తగ్గించాలని రెండు సంస్థలు భావిస్తున్నాయి. 2511 ను మల్టిపుల్ మైలోమాతో పాటు ్రూజుమీ సింద్రోమ్, సిస్టమిక్ లూపస్ ఎరిథిమాటోసస్ వంటి కొన్ని ఆటోఇమ్యూన్ వ్యాధుల కోసం కూడా పరిశీలిస్తున్నట్లు వీజెన్ బయో తెలిపింది. ఇక్కడ వీజెన్ బయోకు సొంతంగా భారీ తయారీ కేంద్రాన్ని నిర్మించాల్సిన అవసరం తగ్గుతుంది. దీంతో పరిశోధన, కొత్త చికిత్సల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టొచ్చు. ఇక న్యూసిలియన్‌కు మాత్రం వంటి అధునాతన కణ ఆధారిత చికిత్సల తయారీ సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రహస్యాల లీక్

ఇద్దరు కీలక అధికారులపై విచారణ!

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఇద్దరు సీనియర్ అధికారులపై విచారణ

రహస్య వ్యాపార సమాచారం బయటకు చేరవేసినట్లు అనుమానాలు

సమాచారం దుర్వినియోగంపై కొనసాగుతోన్న దర్యాప్తు

విచారణ వివరాలను ఉన్నతాధికారులకు ఇప్పటికే వెల్లడి

విచారణ పూర్తయ్యాక చర్యలు తీసుకుంటామని బ్యాంకు ప్రకటన



దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కీలక సమాచారం బయటకు వెళ్లినట్లు అంతర్గత విచారణలో వెల్లడైంది. బ్యాంకుకు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు వ్యాపార వ్యూహాలు, మార్కెట్‌పై ప్రభావం చూపగల సమాచారాన్ని బయటి వ్యక్తులకు చేరవేసినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై విచారణ ఇంకా కొనసాగుతోంది.బ్యాంకులోని కొన్ని కీలక విభాగాలకు బాధ్యత వహిస్తున్న ఈ అధికారులపై అనుమానాలు రావడంతో అంతర్గత విచారణ ప్రారంభించారు. సమాచారం దుర్వినియోగమైందా? దాని వల్ల బ్యాంకుకు లేదా మార్కెట్‌కు ఏమైనా నష్టం జరిగిందా? అనే అంశాలపై పరిశీలిస్తున్నారు. విచారణలో గుర్తించిన విషయాలను ఉన్నతాధికారులతో పాటు బోర్డులోని కొందరు సభ్యులకు ఈ ఏడాది ప్రారంభంలోనే తెలియజేసినట్లు సమాచారం. సంబంధిత అధికారులకు కూడా విచారణ వివరాలు అధికారికంగా తెలిపినట్లు తెలుస్తోంది.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధి అంతర్గత విచారణ జరుగుతున్న విషయాన్ని ధ్రువీకరించారు. అయితే, విచారణలో వెల్లడైన అంశాలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల వివరాలపై స్పందించలేదు. విచారణ పూర్తయ్యాక వెల్లడయ్యే అంశాల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నైతిక విలువలు, పాలనా ప్రమాణాల విషయంలో రాజీ పడబోమని బ్యాంకు స్పష్టం చేసింది.ఈ పరిణామం బ్యాంకుకు కీలకమైన సమయంలో చోటుచేసుకుంది. ఈ నెల 27న అనూప్ బాగ్చీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రత్యర్థి ఐసీఐసీఐ గ్రూపులో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయనకు ఈ పరిణామాలు సవాలుగా మారే అవకాశముంది.ఇటీవల బ్యాంకులో ఉన్నతస్థాయి మార్పులు కూడా చోటుచేసుకున్నాయి. మార్చిలో అప్పటి ఛైర్మన్ చక్రవర్తి వ్యక్తిగత విలువలకు, బ్యాంకులోని కొన్ని విధానాలకు మధ్య విభేదాలున్నాయని పేర్కొంటూ రాజీనామా చేశారు. అయితే, ఆందోళనలకు ఆధారాలు లేవని బ్యాంకు నియమించిన స్వతంత్ర న్యాయ సమీక్ష తెలిపింది. ప్రస్తుత సీఈఓ శశిధర్ జగదీశన్ మరోసారి పదవిలో కొనసాగేందుకు ఆసక్తి చూపలేదు. డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ కైజాద్ భరూచా కూడా డిసెంబరు చివర్లో వైదొలగాలని నిర్ణయించుకున్నారు.

అమెజాన్ ఉన్నతాధికారిపై రేప్ ఆరోపణలు

ఫిర్యాదు చేసిన ఉద్యోగినిని మౌనంగా ఉండాలని కంపెనీ ఒత్తిడి?

అమెజాన్‌పై ఉద్యోగిని లారా డాన్‌బోమ్ దావా

2023లో న్యూయార్క్ పర్యటనలో అత్యాచారం జరిగిందని ఆరోపణ

ఉన్నతాధికారి మైకెలాంజెలో సిమోంటేపై ఆరోపణలు

ఫిర్యాదుపై కంపెనీ సమగ్ర విచారణ జరపలేదన్న లారా

ఆఫీసులో ఆరోపణల గురించి మాట్లాడకుండా ఒత్తిడి తెచ్చారని ఆరోపణ



అంతర్జాతీయ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌పై ఓ ఉద్యోగిని సంచలన ఆరోపణలు చేశారు. సంస్థలో ఉన్నత హోదాలో పనిచేస్తున్న అధికారి తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. దీనిపై కంపెనీకి తెలియజేసినా సమగ్ర విచారణ జరపలేదని, ఘటన గురించి బయట మాట్లాడకుండా తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు న్యూయార్క్ పోస్ట్, సియాటిల్ టైమ్స్ వార్తా కథనాలు ప్రచురించాయి.అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్)లో మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న లారా డాన్‌బోమ్ ఈ దావా వేశారు. 2023 అక్టోబరు 27న పని నిమిత్తం న్యూయార్క్ వెళ్లిన సమయంలో సంస్థలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న మైకెలాంజెలో సిమోంటే తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సిమోంటే మాడ్రిడ్‌లో పనిచేస్తున్న అడ్వర్టైజ్‌మెంట్ విభాగం అధికారి అని పేర్కొన్నారు.దావాలో పేర్కొన్న వివరాల ప్రకారం.. లారా, సిమోంటే సహా పలువురు సహోద్యోగులు న్యూయార్క్‌లో అమెజాన్ నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడి నుంచి కరావోకే బార్‌లకు వెళ్లారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఖర్చులను కంపెనీయే భరించింది. ఆ పర్యటనలోనే తనపై అత్యాచారం జరిగిందని లారా ఆరోపించారు.ఘటనపై ఫిర్యాదు చేసిన తర్వాత అమెజాన్ తనకు సరైన న్యాయం చేయలేదని లారా పేర్కొన్నారు. ఆరోపణల గురించి ఆఫీసులో మాట్లాడకూడదని చెప్పడంతో పాటు, తాను ఆరోపించిన అధికారితో వృత్తిపరమైన సంబంధాలు కొనసాగించాల్సిన పరిస్థితి కల్పించారని దావాలో తెలిపారు. దీనివల్ల ఆఫీసులో తనకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయని ఆరోపించారు. ఉద్యోగులపై వేధింపులు, వివక్ష, లైంగిక దాడులకు సంబంధించిన అంశాలపై మాట్లాడకుండా అడ్డుకోవడాన్ని పరిమితం చేసే వాషింగ్టన్ రాష్ట్ర చట్టాన్ని కూడా కంపెనీ ఉల్లంఘించిందని పేర్కొన్నారు.ఘటన జరిగిన కొన్ని రోజులకే పోలీసులు తనను విచారించారని, డీఎన్ఏ ఆధారాలున్న కండోమ్‌ను అందజేశానని లారా తెలిపారు. అయితే, ఆ ఆధారాలను సిమోంటే డీఎన్ఏ నమూనాతో పోల్చేందుకు పోలీసులు చర్యలు తీసుకోలేదని దావాలో ఆరోపించారు. కంపెనీ కూడా ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరపలేదని ఆమె తరఫు న్యాయవాది జే ఫ్రీ పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై కోర్టులో ఇంకా విచారణ పూర్తికాలేదు.

తొలి రోజే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు భారీ స్పందన.. 2.5 రెట్లు సబ్‌స్క్రిప్షన్

మొత్తం ఇష్యూ విలువ రూ.30,213 కోట్లు

క్యూఐబీ విభాగానికి 7.46 రెట్ల స్పందన

సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగం 1.32 రెట్లు సబ్‌స్క్రైబ్

రిటైల్ విభాగం 60 శాతమే సబ్‌స్క్రైబ్

అక్టోబర్ 23తో ముగియనున్న ఐపీఓ; 28న లిస్టింగ్ అవకాశం



జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు తొలిరోజే భారీ స్పందన లభించింది. రూ.30,213 కోట్ల విలువైన ఈ పబ్లిక్ ఇష్యూకు బుధవారం మధ్యాహ్నం 3.15 గంటల సమయానికి 2.5 రెట్ల బిడ్లు వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌గా నిలిచిన ఈ ఐపీఓ అక్టోబర్ 23 వరకు అందుబాటులో ఉంటుంది.బీఎస్ఈ గణాంకాల ప్రకారం.. ఆఫర్‌లో 19.75 కోట్ల షేర్లు ఉండగా, 49.56 కోట్ల షేర్ల కోసం బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి అత్యధిక స్పందన వచ్చింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ) విభాగం 7.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగానికి 1.32 రెట్ల బిడ్లు వచ్చాయి. రిటైల్ పెట్టుబడిదారుల విభాగం మాత్రం 60 శాతమే సబ్‌స్క్రైబ్ అయింది.రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారుల కోసం కేటాయించిన విభాగం 1.16 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ విభాగంలో అందుబాటులో ఉన్న 2.23 కోట్ల షేర్లకు గానూ 2.59 కోట్ల షేర్ల కోసం బిడ్లు వచ్చాయి. ఉద్యోగుల కోసం కేటాయించిన విభాగం కూడా పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది.ఐపీఓకు ముందు జియో ప్లాట్‌ఫామ్స్ 212 మంది యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.8,109.84 కోట్లు సమీకరించింది. సింగపూర్‌కు చెందిన జీఐసీ, నార్జెస్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ సహా పలు అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, హెచ్‌డీఎఫ్‌సీ, నిప్పాన్ ఇండియా వంటి దేశీయ సంస్థలూ పెట్టుబడులు పెట్టాయి.ఒక్కో షేరు ధరను రూ.1,065 నుంచి రూ.1,119 మధ్య నిర్ణయించారు. ఈ ఆఫర్‌లో గరిష్ఠంగా 27 కోట్ల కొత్త షేర్లను జారీ చేయనున్నారు. అక్టోబర్ 26 నాటికి షేర్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. అక్టోబర్ 28న బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టయ్యే అవకాశం ఉంది.

కొత్త పల్సర్ ఎన్250ఎస్ఎస్ వచ్చేసింది



బజాజ్ ఆటో భారత మార్కెట్లో కొత్త పల్సర్ ఎన్250ఎస్ఎస్ బైక్‌ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధరను రూ.1,59,406గా నిర్ణయించింది. ఇప్పటికే మార్కెట్లో ఉన్న పల్సర్ ఎన్250కి అప్‌డేటెడ్ వెర్షన్‌గా దీన్ని తీసుకొచ్చింది. ఇంజిన్, గేర్‌బాక్స్, డిస్‌ప్లే సహా పలు కీలక మార్పులు చేసింది. ముఖ్యంగా 6-స్పీడ్ గేర్‌బాక్స్, క్విక్‌షిఫ్టర్, 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్ వంటి ఫీచర్లు కొత్త బైక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.డిజైన్ పరంగా పల్సర్ కుటుంబానికి చెందిన స్పోర్టీ రూపాన్ని కొనసాగించింది. బాడీపై పదునైన గీతలు, కొత్త పెయింట్ ఆప్షన్లు, తాజా గ్రాఫిక్స్ అందించారు. హెడ్‌ల్యాంప్ డిజైన్ మాత్రం సాధారణ ఎన్250 మోడల్‌కు దగ్గరగా ఉంది.ఇంజిన్ విషయానికి వస్తే.. ఇందులో 249 సీసీ ఎయిర్-కూల్డ్, ఆయిల్-కూల్డ్ ఇంజిన్‌ను అప్‌డేట్ చేశారు. నాలుగు వాల్వ్‌లతో పనిచేసే ఈ ఇంజిన్ 25 హెచ్‌పీ పవర్, 22 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సాధారణ ఎన్250లో 24.5 హెచ్‌పీ పవర్, 21.5 ఎన్ఎం టార్క్ లభిస్తాయి. అంటే కొత్త మోడల్‌లో స్వల్పంగా పవర్, టార్క్ పెరిగాయి. పాత 5-స్పీడ్ గేర్‌బాక్స్ స్థానంలో 6-స్పీడ్ గేర్‌బాక్స్‌ను ఇచ్చారు. క్లచ్ ఉపయోగించకుండా గేర్లు పెంచేందుకు వీలుగా స్పోర్ట్స్ షిఫ్టర్ ఫీచర్‌ను కూడా స్టాండర్డ్‌గా అందించారు. ఫీచర్ల పరంగా కొత్త బైక్‌లో ఎలక్ట్రానిక్ థ్రాటిల్ బాడీని ప్రవేశపెట్టారు. ఇది ఏబీఎస్ మోడ్‌లతో కలిసి రైడింగ్ మోడ్‌లకు మద్దతు ఇస్తుంది. అయితే, ఆయా మోడ్‌ల పూర్తి వివరాలను కంపెనీ వెల్లడించలేదు. పాత ఎల్‌సీడీ డిస్‌ప్లే స్థానంలో గూగుల్ మ్యాప్స్ మిర్రరింగ్ సదుపాయం ఉన్న 5 అంగుళాల టీఎఫ్‌టీ స్క్రీన్‌ను ఇచ్చారు. ఇందులో ల్యాప్ టైమర్, వాహన పత్రాలను భద్రపరిచే సదుపాయం కూడా ఉంది. అడ్జస్టబుల్ లివర్లు, యూఎస్‌బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్, హజార్డ్ స్విచ్, అకస్మాత్తుగా బ్రేకులు వేసినప్పుడు హెచ్చరించే పానిక్ బ్రేక్ అలర్ట్ ఫీచర్లను జోడించారు. సాధారణ పల్సర్ ఎన్250తో పోలిస్తే ఈ కొత్త మోడల్ ధర రూ.14,000 ఎక్కువ.

భోగి' సినిమా నుంచి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటే సాంగ్



చార్మింగ్ స్టార్ శర్వా, సీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర?ఆదిలాబాద్ సరిహద్దు నేపథ్యంలో సాగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానరిపై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. గ్రామీణ సంప్రదాయాలు, మానవ సంబంధాలు, సామాజిక పరిస్థితులతో ముడిపడిన సహజమైన పల్లెటూరి ప్రపంచాన్ని ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి ఆసక్తిని రేకెత్తించగా, తొలి పాట 'ఎగిలిపారంగ' సినిమాలోని పల్లె వాతావరణంతో కూడిన సంగీత ప్రపంచాన్ని పరిచయం చేసింది. దసరాకు ఒక రోజు ముందు మేకర్స్ ఈ సినిమా నుంచి రెండో పాట 'అన్నయ్య పాసం' ను విడుదల చేశారు. ఇదుగురు చెల్లెళ్లపై ఒక అన్నయ్య చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతలను హృద్యంగా ఆవిష్కరించే ఈ పాటతో పాటు, ప్రధాన బంట ప్రేమకథకు సంబంధించిన కొన్ని అందమైన క్షణాలను కూడా చూపించారు. పల్లెటూరి మట్టి వాసనతో కూడిన పాటలను అందించడంలో ప్రత్యేకత కలిగిన సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను మనసు ఆకట్టుకునేల స్వరపరిచారు.భావోద్వేగాల లోతుతో సాగే ఈ మెలోడీ వినగానే ఆకట్టుకుంటుంది. ఆస్కార్ విజేత, గీత రచయిత చంద్రబోస్ సాహిత్యంతో పాటకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే అనురాగం, త్యాగం, విడదీయలేని అనుబంధాన్ని తన సాహిత్యంలో అందంగా ఆవిష్కరించారు.

సింగర్ శ్రీకృష్ణ తన వోకల్స్ తో ఈ పాటకు ప్రాణం పోశారు. ఆయన వాయిస్ పాటలోని భావోద్వేగాలను మరింత పెంచుతుంది. కథలోని రొమాంటిక్ కోణాన్ని కూడా ఈ పాట ఆవిష్కరిస్తుంది. శర్వా, అనుపమ పరమేశ్వరన్ పాత్రల మధ్య కెమిస్ట్రీని అందంగా చూపించారు. ఆనీ మాస్టర్ కొరియోగ్రఫీ పాటలోని భావానికి చక్కగా సరిపోగా, సహజమైన పల్లెటూరి వాతావరణం, ఆప్యాయతతో కూడిన కుటుంబ సన్నివేశాలు విజువల్స్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. పల్లెటూరి యువకుడిగా శర్వా తన సహజమైన లుక్‌తో ఆకట్టుకున్నారు. నిజాయితీతో కూడిన నటనతో తన పాత్రకు భావోద్వేగాల లోతును కోడించారు. పాటలో ప్రధానంగా కనిపించే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆయన నటన మరింత సహజత్వాన్ని తీసుకొచ్చింది. పల్లెటూరి అమ్మాయిగా అనుపమ పరమేశ్వరన్ అందంగా ఆకట్టుకున్నారు. అద్భుతమైన నటన, మనసును తాకే సాహిత్యం, అందమైన విజువల్స్ కలగలిసి ఈ పాటను 'భోగి' సంగీత ప్రయాణంలో గుర్తుండిపోయే పాటగా నిలబెట్టాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్‌తో పాటు డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటించనున్నారు. నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి



'ఆది రుద్ర' సినిమా పోస్టర్ మోషన్ వీడియో రిలీజ్

ఆది సాయికుమార్ హీరోగా త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రంతో ఆసక్తికరమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. దైవిక , అతీంద్రియ రహస్యాలు, ఉత్కంఠభరితమైన సస్పెన్స్ కలగలిసిన కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రశాంత్ జి. రుద్రప్ప నిర్మిస్తున్న ఈ చిత్రానికి సవరసన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. దసరా పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమాకు పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటిస్తూ ఆకట్టుకునే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'ఆది రుద్ర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ పోస్టర్‌లో ఆది సాయికుమార్ త్రిశూలం పట్టుకుని, వెనక్కి తిరిగి నిలబడిన తీరు ఆకట్టుకుంటోంది. లో యాంగిల్‌లో రూపొందించిన ఈ కంపోజిషన్ ఆయన ఇంటెన్స్ ప్రజెన్స్ మరింత ప్రభావవంతంగా చూపిస్తోంది. ఆకాశాన్ని తాకేలా కనిపించే భారీ పర్వతాలార నిర్మాణంపై దుర్గామాత రూపం దర్శనమిస్తోంది. మరోవైపు, వెలుగుతున్న కాగడాలు పట్టుకున్న భారీ జనసమూహం వృత్తాకారంలో ఉన్న యజ్ఞస్థలాన్ని చుట్టుముట్టిన దృశ్యాలు పోస్టర్‌కు మరింత మిస్టరీని జోడిస్తున్నాయి. మనిషికి, అతీంద్రియ ప్రపంచం పథ్యంలో ఈ కథ సాగనుందనే ఆసక్తిని ఈ విజువల్స్ కలిగిస్తున్నాయి. 1960ల నుంచి 1990ల మధ్య కాలంలో జరిగే కథతో 'ఆది రుద్ర' తెరకెక్కుతోంది. ఈ ప్రత్యేకమైన పీరియడ్ నేపథ్యం సినిమాలోని పాత్రలు, విజువల్ స్టైల్, ఆ కాలం నాటి వాతావరణాన్ని మళ్లీ సృష్టిస్తూ, ఆసక్తికరమైన దైవిక రహస్యాన్ని మిళితం చేసి ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించాలనేది మేకర్స్ లక్ష్యం. ఈ చిత్రానికి ఏజే శెట్టి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. 'కాంతార', 'విరూపాక్ష', 'మంగళవారం', తమిళ బ్లాక్‌బస్టర్ 'మహారాజా' చిత్రాలతో గుర్తింపు పొందిన ప్రముఖ సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మోషన్ వీడియోకు ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ డివైన్ వైబ్ ను అద్భుతంగా ఆవిష్కరిస్తోంది.



30న వస్తున్న 'ఆదర్శ కుటుంబం'

అగ్ర హీరో వెంకటేష్ అంటేనే కుటుంబ కథా చిత్రాలకు పెట్టింది పేరు. ఇక మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దాదాపు ఇరవైఏండ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఆదర్శ కుటుంబం-హౌస్ సంబర్ 47 (ఏకే 47)'. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ కలబోతగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం బుధవారం ప్రకటించింది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, కుటుంబ ప్రేక్షకులు మెచ్చే సంపూర్ణ వినోదాత్మక చిత్రమిదని మేకర్స్ తెలిపారు. శ్రీనిధిశెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాత: ఎస్.రాధాకృష్ణ (చినబాబు), సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: త్రివిక్రమ్ శ్రీనివాస్

దుష్ట శిక్షణలో కనకదుర్గ



నిధి అన్వేషణ ప్రధాన ఇతివృత్తంగా రూపొందిస్తున్న చిత్రం 'సన్ ఆఫ్ కనకదుర్గమ్మ'. లయ, అనురూప్ కటారి, ఆకాంక్ష త్యాగరాజన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి దుర్గ ఫణిందర్ దర్శకుడు. దసరా సందర్భంగా ఈ సినిమా స్పెషల్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాతలు అశ్వనీదత్, స్వప్నదత్ విడుదల చేశారు. ఇందులో నటి లయ అమ్మవారి అవతారంలో శక్తివంతంగా కనిపిస్తున్నారు. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగే ఈ కథలో విజువల్స్, యాక్షన్ ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయని, దుష్టశిక్షణ గావించే అమ్మవారి అవతారంలో లయ కనిపించే సన్నివేశాలు ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందిస్తాయని చిత్రబృందం పేర్కొన్నది. ఈ చిత్రానికి సంగీతం: శశిధర్ లంక, కథ: కాకర్ల గోపర్ధన రావు, నిర్మాతలు: వాణి శంకర్, తిలోత్తమ, దర్శకత్వం: దుర్గ ఫణిందర్ లంక.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.